# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 8-12-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 103 | పేజీలు:4 | వెల: రూ.1/-


## ఎర్ర టోపీలు ఉత్తరప్రదేశ్‌కు రెడ్ అలర్ట్.. సమాజ్‌వాదిపై ప్రధాని విమర్శలు

గోరఖ్‌పూర్, డిసెంబర్ 7: అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఉత్తరప్రదేశ్‌లో రాజకీయం రసవత్తరంగా మారుతున్నది. అన్ని ప్రధాన పార్టీలతోపాటు పలు చిన్నాచితకా పార్టీలు కూడా వ్యూహప్రతివ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఇవాళ యూపీలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ.. గోరఖ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ వేదికపై నుంచే ప్రతిపక్ష సమాజ్‌వాది పార్టీపై ప్రధాని విమర్శలు గుప్పించారు.

ఉత్తరప్రదేశ్‌లో మళ్లీ అధికారం చేజిక్కించుకోవాలని ఎర్రటోపీలు ఎదురుచూస్తున్నాయని ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాది పార్టీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వాళ్లు అధికారంలోకి వస్తే ఉగ్రవాదులతో దోస్తీ చేస్తారని, ఉగ్రవాదులను జైళ్ల నుంచి విడిచిపెడుతారని ఆరోపించారు. ఎర్రటోపీలే యూపీకి రెడ్ అలర్ట్ అని, ప్రమాద ఘంటికలని ప్రధాని విమర్శించారు. ఎర్రటోపీలు అధికారంలోకి వస్తే ఎర్రబుగ్గలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తారని బుగ్గకార్లలో తిరిగే రాజకీయ నాయకులను ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సాధారణ ప్రజల సమస్యలు, బాధలు వారికి పట్టవని చెప్పారు. కుంభకోణాలకు పాల్పడటానికి, ఖజానా నింపుకోవడానికి, దొరికింది దోచుకోవడానికి, మాఫియా శక్తులకు స్వేచ్ఛనివ్వడానికే సమాజ్‌వాది పార్టీ అధికారంపై కన్నేసిందని ఆరోపించారు.

# పార్లమెంట్ సమావేశాలు బహిష్కరించిన టీఆర్ఎస్




న్యూఢిల్లీ, డిసెంబర్ 7:పార్లమెంట్ శీతాకాల సమావేశాలను టీఆర్ఎస్ పార్టీ బహిష్కరించింది. 9 మంది లోక్ సభ సభ్యులు, ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఉభయసభల నుంచి వాకౌట్ చేశారు.

వరి ధాన్యం విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాని నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నారు. యార్డుల్లో ఉన్న ధాన్యాన్ని ఈఅవ తరలించకపోవడంతో ధాన్యం పాడైపోయే పరిస్థితి ఏర్పడిందని టీఆర్ఎస్ ఎంపీ కే.కేశవరావు అన్నారు. రబీ ధాన్యం సేకరణలో కేంద్రం వివక్ష చూపడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. వారం రోజులుగా పార్లమెంట్ వేదికగా ఆందోళన చేస్తున్నామని చెప్పారు. తమ ఆందోళనలను కేంద్రం పట్టించుకోకపోవడం వల్లనే సమావేశాలను బహిష్కరించామని కేకే తెలిపారు.

తదుపరి కార్యాచరణను త్వరలోనే ప్రకటస్తామని తెలిపారు.

అంతకుముందు.. లోక్ సభలో ఏఖీూ ఎంపీలు వినూత్నంగా ఆందోళన చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రైతాంగంపై చూపిస్తున్న వివక్షకు వ్యతిరేకతకు నిరసనగా ఎంపీలు నల్ల దుస్తులతో హాజరు అయ్యారు. రాజ్య సభ, లోక్ సభలలో ఎంపీల నిరసన తెలిపారు. కేంద్రం మొండి వైఖరి నశించాలంటూ.. వరి ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని ఫ్లకార్డుల ప్రదర్శించారు. రైతాంగం కోసం గత వారం రోజులుగా స్పీకర్ పోడియం దగ్గరికి వెళ్లి నినాదాలు చేస్తూ, నిరసన తెలిపారు. రైతులపై ఎక్కుపెట్టిన నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్న కేంద్రం, ధాన్యం కొనుగోళ్లపై స్పష్టతను ఇవ్వడం లేదని మండిపడ్డారు.

## విజయనగరంలో ఒమిక్రాన్ కలకలం

విజయనగరం, డిసెంబర్ 7:: జిల్లాలో ఒమిక్రాన్ కేసు తేలినట్లు పుకార్లు వ్యాపించడంతో కలకలం రేగింది. శృంగవరపుకోటలో ఒమిక్రాన్ కేసు బయటపడినట్లు ప్రజలు చెప్తుండటంతో జిల్లా వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ముక్కుకు మాస్క్ ధరించడమే కాకుండా నిర్ణీత భౌతిక దూరం పాటించాలని అధికారులు ప్రజలు సూచిస్తున్నారు. అలాగే, ఒమిక్రాన్ వ్యాపించకుండా ఉండేందుకు ప్రతిఒక్కరూ కొవిడ్ వ్యాక్సిన్ తీసుకోవాలని ప్రభుత్వం చెప్తున్నది.

విజయనగరం జిల్లాలోని శృంగవరపుకోటలో ఒమిక్రాన్ కలకలం రేగింది. ఐర్యాండ్ నుంచి వచ్చిన ఒక వ్యక్తిలో ఒమిక్రాన్ తేలిందంటూ పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దాంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ముంబైలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన తర్వాత కరోనా పరీక్షలు చేయించుకోకుండానే సదరు వ్యక్తి తిరుపతికి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. అక్కడి నుంచి ఆ వ్యక్తి నేరుగా శృంగవరపుకోటలోని తన అత్తగారింటికి చేరినట్లు అధికారులు తెల్సుకున్నారు. కాగా, ముంబై విమానాశ్రయం అధికారుల సమాచారం మేరకు సదరు వ్యక్తికి కొవిడ్ పరీక్షలు చేయించగా.. పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దాంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. అయితే, సదరు వ్యక్తిలో ఒమిక్రాన్‌కు సంబంధించిన లక్షణాలేవీ కనిపించలేదని వైద్యులు స్పష్టం చేశారు.

# మేడిన్ హైదరాబాద్‌గా ఫైటర్ వింగ్స్ తయారీ : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 7: ఆదిభట్లలో టాటా ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ ఫైటర్ వింగ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. మేడిన్ హైదరాబాద్‌గా ఫైటర్ వింగ్స్ తయారు చేశారని పేర్కొన్నారు. హైదరాబాద్ ఏరోస్పేస్, డిఫెన్స్ ఎకోసిస్టమ్ తక్కువ సమయంలోనే ఎంతో ఎత్తుకు ఎదిగాయనడానికి.. ఎఫ్-16 వింగ్ సర్టిఫికేషన్, డెలివరీ గొప్ప సాక్ష్యంగా నిలిచాయన్నారు. టాటా, లాక్‌హీడ్ మార్టిన్ భాగస్వామ్యం శుభ పరిణామం అని కేటీఆర్ పేర్కొన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి టాటా, లాక్‌హీడ్ మార్టిన్ చేసిన నిరంతర సహకారానికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ రెండు రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో ఇండియాలోనే తెలంగాణ అత్యంత చురుకైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రగతిశీల విధానాలు, మౌలిక సదుపాయాలతో ఈ రంగం గత ఐదేండ్లలో అపూర్వమైన వృద్ధిని సాధించిందని స్పష్టం చేశారు. ఐదేండ్లుగా



తెలంగాణ పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. టీఎస్ ఐపాస్‌తో వేగంగా, పారదర్శకంగా అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఏరోస్పెస్ సెక్టార్‌లో 2020లో తెలంగాణకు అవార్డు వచ్చిందని కేటీఆర్ గుర్తు చేశారు.

## ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటాం.. కేంద్రానికి టీఆర్ఎస్ ఎంపీల హెచ్చరిక

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై టీఆర్ఎస్ ఎంపీలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మోదీ దిగిపోతేనే ఈ దేశ రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. మోదీ ప్రభుత్వంపై ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని తేల్చిచెప్పారు. ఇదే నినాదంతో ముందుకు వెళ్తామని ఎంపీలు స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాలను బాయ్ కాట్ చేసిన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ ఎంపీ కే కేశవరావు మీడియాతో మాట్లాడారు. మోదీది ఫాసిస్ట్ ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. ప్రజలను బీజేపీపై తిరుగుబాటు చేసేలా సమాయత్తం చేస్తామన్నారు. టీఆర్ఎస్ ఆందోళనలపై కేంద్రం స్పందించడం లేదన్నారు. చట్టసభను బాయ్‌కాట్ చేయడం బాధ కలిగించే విషయమే.. కానీ కేంద్రం తీరుకు నిరసనగానే బాయ్‌కాట్ చేస్తున్నామని ఎంపీ కేకే స్పష్టం చేశారు. సభను బాయ్‌కాట్ చేయాలని ఎవరూ కోరుకోరు అని ఆయన పేర్కొన్నారు.

కేంద్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం ఉందన్నారు. రబీలో పూర్తిగా ఉప్పుడు బియ్యం మాత్రమే వస్తుంది. వాతావరణ పరిస్థితుల వల్ల రబీలో రా రైస్ రాదు. రబీ ధాన్యం విరిగిపోయి నూకగా మారుతుంది. రబీ ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌గా మారుస్తాం. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఎఫ్‌సీఐ నిర్లక్ష్యం వహిస్తోంది. తెలంగాణ నుంచి బాయిల్డ్ రైస్ కొనబోమని చెబుతున్నారు అని ఎంపీ కేకే పేర్కొన్నారు.

## జీవాయుధ యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి: సీడీఎస్ రావత్




న్యూఢిల్లీ, డిసెంబర్ 7:చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ ఇవాళ కీలక వ్యాఖ్యలు చేశారు. జీవాయుధ పోరాటానికి సన్నద్ధంగా ఉండాలన్నారు.

ప్యానెక్స్-21 ప్రారంభోత్స ఈవెంట్‌లో పాల్గొన్న త్రివిధదళాధిపతి రావత్ మాట్లాడుతూ.. ఓ కొత్త విషయాన్ని హైలెట్ చేయాలనుకు న్నానని, కొత్త తరహా యుద్ధానికి సన్నద్ధం కావాలని, ఒకవేళ జీవాయుధ పోరాటాలు ప్రారంభం అవుతున్నట్లు గమనిస్తే, అప్పుడు మరో దానికి తగినట్లు బలోపేతం కావాలన్నారు. వైరస్‌లు, వ్యాధులు తట్టుకునే రీతిలో మన దేశం ప్రిపేర్ కావాలని సీడీఎస్ రావత్ తెలిపారు. ప్రస్తుతం ఒమిక్రాన్ వేరియంట్ ఆందోళన కలిగిస్తోందని, భవిష్యత్తులో వైరస్‌లను ఎదుర్కొనేందుకు సమాయత్తమై ఉండాలన్నారు. ఏ దేశంలోనైనా ఇలాంటి సమస్య వస్తే, అప్పుడు ఒకర్ని ఒకరు ఆదుకోవాలన్నారు.

ప్యానెక్స్-21 పేరుతో డిజాస్టర్ మేనేజ్మెంట్ విన్యాసాలు నిర్వహిస్తున్నారు.

ఈ విన్యాసాల్లో బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ శ్రీలంక, మయన్మార్, థాయిలాండ్ దేశాలు పాల్గొంటున్నాయి. మూడు రోజుల పాటు ఆ విన్యాసాలు ఉంటాయి. ఇప్పుడి వరకు రకరకాల విపత్తులు వచ్చాయని, కొన్ని సహజమైనవి కాగా, మరికొన్ని మనుషులు సృష్టించినవని, అయితే వైరస్‌లతో వచ్చే మహమ్మారులను ఎదుర్కొనేందుకు మనం ప్రిపేరై ఉండాలని రావత్ తెలిపారు. ఇప్పుడు ఒమిక్రాన్ వ్యాపిస్తోందని, ఒకవేళ ఆ వేరియంట్ కూడా మ్యుటేట్ అయితే, అప్పుడు వాటిని కూడా ఎదుర్కోవాలన్నారు.

భారత సైనిక చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణే మాట్లాడుతూ.. కొత్త వేరియంట్ల రాకతో కొత్తగా కేసులు పెరుగుతున్నాయని, దీంతో ఇప్పట్లో కోవిడ్ మహమ్మారి వెళ్లిపోయేలా లేదన్నారు. వాతావరణ మార్పులు, ప్రణాళికలేని పట్టణీకరణ, అభివృద్ధి లేకపోవడం, పేదరికం వల్ల ఇలాంటి విపత్తులు మరింత ప్రమాదకరంగా మారుతాయన్నారు.

## వందశాతం వాక్సినేషన్ కు ప్రతినిధులు చొరవ చూపాలి : మంత్రి సబితా



రంగారెడి, డిసెంబర్ 7: : వంద శాతం వాక్సినేషన్ జరిగేలా స్థానిక సంస్థల ప్రతినిధులు చొరవ చూపాలని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కోవిడ్ వాక్సినేషన్,ఒమిక్రాన్ వేరియంట్ పై జరుగుతున్న సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

కొవిడ్ మొదటి, రెండో వేవ్‌లో బాగా పని చేసిన వైద్య విభాగం వారికి, మున్సిపల్, పంచాయతీ రాజ్, పోలీస్ శాఖల వారికి అభినందనలు తెలిపారు.

అలాగే ఒమిక్రాన్ వేరియంట్‌ను ఎదుర్కోవటానికి ప్రభుత్వం, వైద్య శాఖ సిద్ధంగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులు పాఠశాలలను సందర్శించాలి.

కొవిడ్ ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. తక్కువ వ్యాక్సినేషన్ ఉన్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక డ్రైడ్‌లు చేపట్టి పూర్తి స్థాయిలో వ్యాక్సిన్ వేసేలా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి వెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించి జాగృత పర్చాలని మంత్రి సూచించారు.

సమావేశానికి మూసి రివర్ బోర్డు చైర్మన్ సుధీర్ రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ తీగల అనిత రెడ్డి, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య , అంజయ్య యాదవ్, కలెక్టర్ అమోయ్ కుమార్, అడిషనల్ కలెక్టర్ ప్రతిక్ జైన్, డిసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి , గ్రంథాలయ సంస్థ చైర్మన్ పాండురంగ రెడ్డి, జడ్పీ సిఈఓ, వివిధ శాఖల అధికారులు, ఆయా మండలాల ఎంపీపీ, జడ్పీటీసీలు, ఎంపీడీవో లు, తహసీల్దార్ లు, మునిసిపల్ మేయర్, డిప్యూటీ మేయర్లు, చైర్ పర్సన్లు, వైస్ చైర్మన్లు హాజరయ్యారు.

## కొల్లాపూర్‌లో మామిడి మార్కెట్ ఏర్పాటుకు చర్యలు : మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 7:కొల్లాపూర్‌లో మామిడి మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యవసాయం లేకుండా భారతదేశం లేదు. రైతుల శ్రేయస్సు కోసం పంటలకు మద్దతుధరపై కేంద్రం చట్టం చేయాలని అన్నారు. మార్కెటింగ్, ఉద్యాన శాఖ, వేర్ హౌసింగ్, మార్క్ ఫెడ్, హాకా సంస్థలపై హిమాయత్ నగర్ మార్కెటింగ్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షకు మంత్రి హాజరై మాట్లాడారు.

కేంద్రం నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేసిన నేపథ్యంలో గతంలో లాగా రాష్ట్ర వ్యవసాయ చట్టం, నిబంధనల ప్రకారం వ్యవసాయ మార్కెట్లను మరింత పటిష్టం చేయాలన్నారు. వ్యవసాయ మార్కెట్లలో మార్కెట్ ఫీజు పకడ్బందీగా వసూలు చేయాలి. చెక్ పోస్టులు అన్నింటినీ బలోపేతం చేయాలని పేర్కొన్నారు.

రాబోయే కాలంలో వచ్చే వ్యవసాయ ఉత్పత్తుల నేపథ్యంలో మార్కెట్లలో వసతులు సమకూర్చాలి. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. యాసంగిలో పంటల మార్పిడి పెద్ద ఎత్తున చర్చ జరుగాలని మంత్రి సూచించారు. పప్పుగింజలు, నూనెగింజలు అధికంగా సాగు చేయాలి. కోహెడలో అంతర్జాతీయ స్థాయి వసతులతో మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు.

జగిత్యాల మామిడి ముంబయికి వెళ్తుంది. కొల్లాపూర్ మామిడికి అక్కడే మార్కెట్ ఏర్పాటు చేస్తే హైదరాబాద్ మార్కెట్ మీద వత్తిడి తగ్గుతుందన్నారు. హైదరాబాద్ మార్కెట్ కు వచ్చేది ప్రధానంగా దక్షిణ తెలంగాణ మామిడి అన్నారు. ఉద్యాన పంటల అమ్మకాలలో రైతులు నష్టపోకుండా చర్యల తీసుకోవాలన్నారు. దీనిపై వివిధ రాష్ట్రాల మార్కెట్లను అధ్యయనం చేసి రైతులకు లాభం కలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరంగల్, ఖమ్మంలలో మిరప ట్రేడింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలుతీసుకుంటామన్నారు. యాసంగి సాగుకు సరిపడా ఎరువుల సన్నద్ధతపై సమీక్షించారు. వివిధ ప్రభుత్వ గురుకులాలు, పాఠశాలలకు నిత్యావసర వస్తువుల సరఫరా దిశగా హాకా ఆలోచించాలన్నారు. శ్రీగంధం సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే పట్టణప్రాంతాల చుట్టూ కూరగాయల సాగు పెంపుపై దృష్టి సారించాలన్నారు.

### చరిత్రలో నేటినిజం


నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం




కం॥ అసమాన్ష్టి నికపటాభినయ
నసమానమ్మైన నటన నందించుటచే
పసగలగిన అభినేత్రిని-
రసరాగిణి యనెద- "షర్మిలాటాగోరున్"!!

-రాధశ్రీ

(డిసెంబర్ 8 నటి షర్మిలాటాగోర్ జన్మదినం..)

సెల్: 9494481210



## ధాన్యం కొనుగోలు ప్రక్రియని వేగవంతం చేయండి .. హైకోర్టు ..

హైదరాబాద్, డిసెంబర్ 7:ధాన్యం కొనుగోలు ప్రక్రియని వేగవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి హై కోర్టు సూచించింది. ధాన్యం కొనుగోళ్ళు లేనందున రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని కొనుగోళ్లు చేపట్టేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని లా స్టూడెంట్ కోర్టులో ప్రయో ప్రయోజిత వ్యాజ్యంని దాఖలు చేశారు. కాగా ప్రభుత్వ మద్దతు ధర కంటే చాలా తక్కువ ధరకే దళారీలకు ధాన్యం అమ్ముకుంటున్నారని ఆ పిటిషన్‌లో తెలిపారు. దీని వల్ల దళారీలు లబ్ది పొందుతున్నారని, కానీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులను రక్షించాలని కోరారు. ఈ నేపథ్యంలో హైకోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తాము చట్టాల ప్రకారమే నడుచుకోవాల్సి వస్తుందని తెలిపింది. చట్టాలు రూపొందించాల్సింది తాము కాదంది.మద్దతు ధర విషయంలో ఎలాంటి చట్టం లేదని చెప్పింది. అయితే సాధ్యమైన త త్వరగా వడ్ల కొనుగోలుకు అవసరమైన దారులు వెతకాలని, వేగంగా రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు ప్రయత్నించాలని ప్రభుత్వానికి సూచించింది. తెలంగాణ రైతాంగం నుంచి ఇప్పటికే 27.07 లక్షల టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేశామని తెలంగాణ ప్రభుత్వం తరుపున అడ్వకేట్ జనరల్ హైకోర్టుకు తెలిపారు. వానాకా లంలో పండిన పంట మొత్తం కొంటామని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రూ. 2,800 కోట్లు ఇప్పటికే రైతులకు చెల్లించామని అన్నారు. ధాన్యం కొనుగోలు కోసం 6439 కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు.. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే నెల 22వ తేదీ వరకు వరి ధాన్యం సేకరిస్తామని ..రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## ఎటూ తేల్చుకోకుండానే ముగిసిన రైతు సంఘాల భేటీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 7:కేంద్ర ప్రభుత్వం పంపిన డ్రాఫ్ట్ లెటర్ పై ఎటూ తేల్చుకోకుండానే రైతు సంఘాల భేటీ ముగిసింది. ఎమ్మెస్పీని నిర్ణయించడానికి చట్టబద్ధమైన ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని, రైతులపై ఉన్న కేసులు ఎత్తేస్తామని కేంద్రం ఓ డ్రాఫ్ట్ లెటర్‌ను రైతు నేతలకు పంపింది. ఈ డ్రాఫ్ట్ లెటర్ పై చర్చించడానికి "సంయుక్త కిసాన్ మోర్చా" ఢిల్లీ సరిహద్దుల్లోని సింఘూ సరిహద్దులో సమావేశమైంది. అయితే ఎలాంటి నిర్ణయమూ తీసుకోకుండానే ఈ సమావేశం ముగిసింది. బుధవారం మరోసారి సమావేశమై, కేంద్రం పంపిన డ్రాఫ్ట్ లెటర్‌పై చర్చిస్తామని సంయుక్త కిసాన్ మోర్చా పేర్కొంది. ఈ సమావేశం తర్వాతే.. ఆందోళన విరమణపై సంయుక్త కిసాన్ మోర్చా అధికారికంగా ఓ ప్రకటన చేసే అవకాశాలున్నాయని సమాచారం.

ఇక.. సమావేశం ముగిసిన తర్వాత సంయుక్త కిసాన్ మోర్చాకు సంబంధించిన ఓ నేత మాట్లాడారు. తాము ఉద్యమాన్ని పూర్తిగా నిలిపేస్తేనే తమపై ఉన్న కేసులు ఎత్తేస్తామని ప్రభుత్వం అంటోందని, దీనిపై తమకు అభ్యంతరాలున్నాయని అన్నారు. కేసుల ఎత్తివేత అనేది అతి తొందరగా ప్రారంభం కావాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై తాము కొన్ని సవరణలను కూడా సూచించామని, పంజాబ్ తరహాలో మరణించిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్ చేసింది.

## ఆన్‌లైన్‌లోనే అన్ని శాఖల ఆడిటింగ్ : మంత్రి హరీశ్‌రావు




హైదరాబాద్, డిసెంబర్ 7:వందకు వంద శాతం అన్ని శాఖల ఆడిటింగ్ ఆన్‌లైన్‌లో జరిగే దిశగా అడుగులు వేయాలని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సూచించారు. రంగారెడ్డి జిల్లాలో ప్రయోగాత్మకంగా ఆన్‌లైన్ ఆడిటింగ్ ప్రారంభించాలన్నారు. ఆడిట్ శాఖ గౌరవం మరింత పెరిగేలా పని చేయాలని, ప్రతీ పైసా ప్రజలకు చేరడమే లక్ష్యంగా పని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక శాఖ హెచ్‌వోడీలు, జిల్లా స్థాయి ఆర్థిక, ఆడిట్ అధికారులతో మంత్రి హరీశ్‌రావు సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖలో వంద శాతం ఆన్ లైన్ ఆడిటింగ్ చేసిన రాష్ట్రంగా తెలంగాణ కేంద్ర ప్రభుత్వం నుండి ప్రసంశలు పొందిన నేపథ్యంలో ఆ శాఖ వారందరికీ హరీశ్‌రావు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ఆడిటింగ్‌తో పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పూర్తిస్థాయిలో రికవరీ, అభ్యంతరాలు పరిష్కారం చేసేలా అడుగులు వేయాలన్నారు. స్థానిక సంస్థలకు, ఇతర శాఖల నుండి వచ్చే అభ్యంతరాలకు సంబధించిన పేరాలను పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు. రంగారెడ్డి జిల్లాలో ఈ మూడు నెలల్లో 2400 అభ్యంతరాలను ఆడిట్ చేసి పరిష్కరించడం ద్వారా రూ. కోటి 26 లక్షల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు జమ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆ జిల్లా అదనపు కలెక్టర్‌ను, ఆడిట్ సిబ్బందిని హరీశ్‌రావు అభినందించారు. ఇదే రీతిలో అన్ని జిల్లాల్లో ఆడిట్ మీటింగ్స్ పెట్టి పూర్తిగా అభ్యంతరాలను పరిష్కరించాలి అని ఆదేశించారు. ఈ ఐదారు నెలల్లో ఆయా శాఖలకు సంబంధించి పూర్తిగా ఎలాంటి అభ్యంతరాలు లేకుండా ఆడిట్ డిపార్ట్‌మెంట్ చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజా ధనం వ్యర్థం కాకుండా సరైన రీతిలో వినియోగం అయ్యేలా చూడటమే ఆడిట్ డిపార్ట్‌మెంట్ ముఖ్య విధి అని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఆయా శాఖలవారీగా ఎక్కడైనా నిధుల దుర్వినియోగం జరిందా? లేదా? అని పకడ్బందీగా ఆడిట్ నిర్వహించాలి. నిధుల దుర్వినియోగం జరిగితే ఆ సమాచారం శాఖల వారీగా తెప్పించాలి అని సూచించారు. జాయింట్ డైరెక్టర్లు తరచూ క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆడిటింగ్ సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు రుణ మాఫీ సరిగా జరిగిందా? లేదా? పరిశీలన జరపాలి. బ్యాంకు వద్ద ఉన్న సమాచారం, సంబంధిత శాఖ వద్ద ఉన్న సమాచారం సరిపోల్చుకోవాలి అని చెప్పారు. అదే రీతిలో వడ్డీలేని రుణాలు, స్వయంసహాయక బృందాలకు రుణాలు సరిగా అందుతున్నాయా? లేదా? పరిశీలించాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసే ప్రతీ పైసా లబ్దిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# భారత జనాభా తగ్గనుందా?!

**(తాజా 'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5' ఫలితాల ఆధారంగా)**

2015-16 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-4 వివరాలతో పోల్చితే నేటి 2019-21 సర్వే-5 వివరాల ప్రకారం మె?త్తం సంతానోత్పత్తి రేటు (ఒక మహిళకు సంతానం సంఖ్య) 2.2 నుంచి 2.1కు తగ్గిందని, కుటుంబ నియంత్రణ పాటించే దంపతుల రేటు 54 శాతం నుంచి 67 శాతానికి పెరగడం గమనించామని తాజాగా (బుధవారం 24 నవంబర్ 2021) కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 'జాతీయ కుటుంబ సర్వే-5 (నేషనల్ ఫామిలీ హెల్త్ సర్వే-5, యన్‌యఫ్‌హెచ్‌యస్-5) వివరాలు తెలుయజేస్తున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5లో భాగంగా దేశవ్యాప్తంగా 707 జిల్లాల్లోని 6.1 లక్షల కుటుంబాలకు చెందిన 7.24 లక్షల మహిళలు, 1.02 లక్షల పురుషుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నారు. పిల్లలు, మహిళల్లో దాదాపు సగం జనాభా రక్తహీనత (ఎనీమియా)తో బాధ పడుతున్నారని గమనించారు. దేశ జనాభా, సంతానోత్పత్తి, పిల్లల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, పోషకాహారం లాంటి పలు ప్రధాన అంశాల ఆధారంగా నిర్వహించిన యన్‌యఫ్‌హెచ్‌యస్-5 సర్వే పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. 15-49 ఏండ్ల మహిళలు, పురుషులలో బాడీ మాస్ ఇండెక్స్ (బియంఐ) ఫలితాల విశ్లేషణ ఆధారంగా సాధారణం కన్న తక్కువ బియంఐ ఉన్న వారు 4 శాతం తగ్గడం, సాధారణం కన్న అధిక బియంఐ 4 శాతం పెరగడం గమనించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 తొలి దశ జూన్ 2019 నుంచి జనవరి 2020 వరకు, రెండవ దశ జనవరి 2020 నుంచి ఏప్రిల్ 2021 వరకు నిర్వహించి, నేటి తాజాగా వివరాలను విడుదల చేశారు. దేశంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-1 నుంచి సర్వే-4 వరకు 1992-93, 1998-99, 2005-06, 2015-16ల్లో నిర్వహించగా, 2019-21లో సర్వే-5 వివరాలు ప్రకటించారు.

పోషకాహార లోపంతో పిల్లల పెరుగుదల (స్టంటెడ్ గ్రోత్) 38 శాతం నుంచి 36 శాతానికి, వేస్టింగ్ సమస్య 21 శాతం నుంచి 19 శాతానికి, తక్కువ బరువు (అండర్ వేయిట్) 36 శాతం నుంచి 32 శాతానికి తగ్గాయని తెలుస్తున్నది. తొలి 6 మాసాల్లో తల్లి రొమ్ముపాల అందుబాటు 2015-16లో 55 శాతం ఉండగా, 2019-21లో 64 శాతానికి పెరగడం సంతోషదాయకం. ఆసుపత్రి ప్రసవాలు 79 శాతం నుంచి 89 శాతానికి పెరగడం శుభ పరిణామమని తెలుస్తున్నది. తమిళనాడు, పుదుచ్చేరీల్లో 100 శాతం ఆసుపత్రి ప్రసవాలు గమనించారు. ప్రైవేట్ ఆసుపత్రుల మూలంగా సిజేరియన్ ప్రసవాలు పెరిగాయని సర్వే వివరాలు వివరిస్తున్నాయి. 12-23 నెలల పిల్లలకు టీకాల అందుబాటు 62 శాతం నుంచి 76 శాతానికి పెరగడం హర్షదాయకం. ఒడిసాలో పిల్లల టీకాల కార్యక్రమం 90 శాతం వరకు ఫలించిందని తెలుస్తున్నది. బ్యాంకు ఖాతాలు ఉన్న మహిళల వివరాల ప్రకారం గతంలో 53 శాతం ఉండగా, నేడు 79 శాతానికి పెరగడం గమనించారు. భారత్‌లో ప్రతి 1,000 మంది పురుషులకు 1,020 స్త్రీలు ఉన్నారనే లింగ నిష్పత్తిని గమనించినప్పటికీ ఈ వివరాలు ఖచ్చితమైన దేశ సగటు కాదని తెలుసుకోవాలి. దేశంలో పారిశుధ్య సౌకర్యాలు, వంట గ్యాస్ లభ్యత, రుతుస్రావ శుభ్రత లాంటి అంశాల్లో ఆశించినంత ప్రగతి సాధించలేదని తెలుస్తున్నది. జీవిత భీమా కలిగిన భారత కుటుంబాల సంఖ్య 1.4 రెట్లు పెరిగి 41 శాతానికి చేరడం గమనించారు. పిల్లల్లో పోషకాహార లోపాలు, సిజేరియన్ ప్రసవాలు, రక్తహీనత, మహిళా సాధికారత, పారిశుధ్యం, వ్యక్తిగత శుభ్రత లాంటి అంశాలు నేటికీ దేశాన్ని పట్టి పీడిస్తున్నాయని గమనిద్దాం. ప్రజారోగ్యాన్ని కాపాడుటలో ప్రతి ఒక్కరం భాగస్వాములం అవుదాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## ఈనెల 10న మెదక్ శాసనమండలి ఎన్నిలకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం



మెదక్, డిసెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి) మెదక్ స్థానిక సంస్థల నియోజక వర్గ శాసన మండలికి ఈ నెల 10 న జరగనున్న పోలింగ్ సందర్భంగా మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ ను, పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు వీరబ్రహ్మయ్య సోమవారం నాడు జిల్లా ఎన్నికల అధికారి హరీష్, సహాయ ఎన్నికల అధికారి రమేష్ తో కలిసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ కు ఉన్న కిటికీలను ప్లయి వుడ్ తో పూర్తిగా మూసివేయాలని, కళాశాలో ఉన్న 4 సి.సి.కెమెరాలను పరిశీలించి అదనంగా మరో రెండు కెమెరాలను బ్యాక్ సైడ్, మరియు ప్రక్కన ఏర్పాటు చేయవలసినదిగా జిల్లా ఎన్నికల అధికారికి సూచించారు. అదేవిధంగా కళాశాలలోకి వచ్చి, పోవడానికి ఒకే ప్రధాన ద్వారాన్ని ఉపయోగించేలా చూడాలని సూచించారు. అవసరమైన మేరకు బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఎన్నికల అధికారికి సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ భానుప్రసాద్, కళాశాల ప్రధానాచార్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రపంచంలోనే అతి పెద్ద భారత రాజ్యాంగం లిఖించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్.

మెదక్, డిసెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి) అందరికి సమన్యాయం అందించాలని ప్రపంచంలోనే అతి పెద్ద భారత రాజ్యాంగం లిఖించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని జిల్లా కలెక్టర్ ఎస్.హరీష్ కొనియాడారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్థంతి సందర్భంగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్ తో కలిసి ఆయన చిత్రపటానానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంటరానితనం, కుల నిర్మూలనకు అంబేద్కర్ ఎంతో కృషి చేశారని అన్నారు. రాజ్యాంగ శిల్పిగా, ప్రజాస్వామ్య పరిరక్షకునిగా, సంఘ సంస్కర్తగా, మహామేధావిగా కొనియాడబడుతున్న వారి మహోన్నత ఆశలు, ఆశయాలకనుగుణంగా మనం ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, జిల్లా కోశాధికారి చిన్న సాయిలు, బి.సి. అభివృద్ధి అధికారి జగదీశ్, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో మూడువందల మంది తాగుబోతులు .. కేసు నమోదు ..

హైదరాబాద్, డిసెంబర్ 7:డ్రంక్ అండ్ డ్రైవ్ లో నిన్న రాత్రి 300మంది తాగుబోతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ లో జరిగిన రోడ్డు ప్రమాదం నేపథ్యంలో హైదరాబాద్ లో పలు చోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ ని పోలీసులు ముమ్మరం చేశారు. కాగా నిన్న ఒక్క రోజే.. జంట నగరాల్లో 124 చోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నమోదు అయ్యాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌ల్లో 50కి పైగా కేసులు నమోదు అయ్యాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుంటే తప్పించుకునేందుకు కొంత మంది ప్రయత్నం చేశారు. పోలీసులను చూసి పరారయ్యారు పలువురు. బంజారాహిల్స్ రోడ్డు ప్రమాదం చేసిన రోహిత్, సుమన్‌లను అరెస్ట్ చేశారు పోలీసులు. వారిని 14 రోజులు రిమాండ్‌కు తరలించారు పోలీసులు.

## మహిళలకు రూ.1000 చొప్పున ఇవ్వాలా వద్దా..?

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ అక్కడి అధికార కాంగ్రెస్ పార్టీకి, ఈసారి పంజాబ్‌లో పాగా వేయాలని చూస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి మధ్య మాటల యుద్ధం మొదలైంది. తాము పంజాబ్‌లో అధికారంలోకి వస్తే రాష్ట్రంలో 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1000 చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని ఇటీవల కేజ్రీవాల్ ప్రకటించారు. దీనిపై పంజాబ్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నది. ఈ నేపథ్యంలో ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్.. ఇవాళ జలంధర్‌లో ఓ సభలో మాట్లాడుతూ.. పంజాబ్ కాంగ్రెస్ నేతల పేర్లు ప్రస్తావించకుండానే కౌంటర్ ఇచ్చారు.'18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1000 ఆర్థిక సాయం అందిస్తామని ఇటీవల నేను ప్రకటించాను. నేను ఆ ప్రకటన చేసినప్పటి నుంచి వాళ్లు (పంజాబ్ కాంగ్రెస్ నేతలు) నాకు శాపనార్థాలు పెడుతున్నారు. నేను వాళ్లని ఒక్కటే అడుగుతున్నా. మహిళలకు నెలకు రూ.1000 ఇవ్వమంటున్నారా వద్దంటున్నారా..?' అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. వాళ్ల శాపనార్థాలు వింటుంటే, తనకే తానేమైనా తప్పుచేశానా..? అనే సందేహం కలుగుతున్నదని ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

### ఉద్యమంలో చనిపోయిన రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వాల్సిందే: రాహుల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 7:కేంద్రం తెచ్చిన వ్యవయసాయ చట్టాలను నిరిసిస్తూ చేపట్టిన ఉద్యమంలో దాదాపు 700 మందికి పైగా రైతులు చనిపోయారని, వారి కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చి తీరాల్సిందేనని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. లోక్‌సభలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టిన రాహుల్ ఉద్యమంలో మరణించిన ప్రతి రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సాగు చట్టాలపై ప్రధాని మోదీ తన తప్పు తెలుసుకుని క్షమాపణలు చెప్పారని, వ్యవసాయ మంత్రి మాత్రం చనిపోయిన రైతుల డేటా లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రైతు కుటుంబాలకు ఐదు లక్షల పరిహారం ఇచ్చి పంజాబ్ సర్కార్ ఆదుకుందని, ఇప్పటికైనా బీజేపీ సర్కార్ ఆ దిశగా అడుగులు వేయాలని రాహుల్ డిమాండ్ చేశారు.

# ఔషధ మొక్కల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసిన లక్నోకి చెందిన ఎన్ఎంపిబి, సిఎస్ఐఆర్-సీమాప్

న్యూఢిల్లీ, డిసెంబర్ 7:జాతీయ ఔషధ మొక్కల బోర్డు (ఎన్ఎంపిబి), కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్-సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ ప్లాంట్స్, (సిఎస్ఐఆర్-సీమాప్), ఔషధ మొక్కలకు సంబంధించి నాణ్యమైన మొక్కలు ఉత్పత్తి (క్యూపిఎం)ని ప్రోత్సహించడానికి ఉమ్మడి సహకార ప్రయత్నాలను విస్తరించడానికి ఈ రోజు ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి.

ఈ ఎమ్ఒయు ఎన్ఎంపిబి ద్వారా గుర్తించిన ఔషధ మొక్కలు, మూలికల క్యూపిఎం అభివృద్ధిని సులభతరం చేస్తుంది మరియు వివిధ వ్యవసాయ-వాతావరణ మండలాల్లో తగిన ఔషధ మొక్కలను అభివృద్ధి, ప్రచారం, సంరక్షణ మరియు పెంపకం కోసం ఆయా నర్సరీలను స్థాపించడంలో సహాయపడుతుంది. లక్నోసిఎస్ఐఆర్-సీమాప్, సామూహిక గుణకారం, వ్యవసాయ-సాంకేతికత అభివృద్ధి, ఎంపిక చేసిన ఔషధ మొక్కలు మరియు మూలికల నాణ్యమైన నాటడం మెటీరియల్ ఉత్పత్తిపై పరిశోధనను కూడా చేపట్టవచ్చు.ఎమ్ఓయు కాలంలో, ఎన్ఎంపిబి తన అమలు చేసే ఏజెన్సీల ద్వారా అంటే రాష్ట్ర ఔషధ మొక్కల బోర్డులు, రాష్ట్ర ఉద్యానవన శాఖలు, సిఎస్ఐఆర్-సీమాప్ లక్నోతో కలిసి మరియు సహకారంతో భారతదేశం అంతటా ప్రాంతీయ, సులభతర కేంద్రాలు, ఔషధ మొక్కల క్యూపిఎం అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్ట్‌లకు మద్దతు ఇస్తుంది. ఆయుష్ మంత్రిత్వ శాఖ క్రింద పని చేస్తున్న ఎన్ఎంపిబి, ఔషధ మొక్కలకు సంబంధించిన అన్ని విషయాలను సమన్వయం చేయడం మరియు వాణిజ్యం, ఎగుమతి, సంరక్షణ సంబంధించిన విధానాలు మరియు కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం తప్పనిసరి.



# కరోనాతో మారిన ప్రజల జీవన విధానం..

హైదరాబాద్, డిసెంబర్ 7:గతంలోనూ భూమ్మీదకు పలురకాల వైరస్ లొచ్చాయి. జనజీవనాన్ని కాకవికలం చేశాయి. లక్షలాది మందిని పొట్టన పెట్టుకున్నాయి. ఆ వైరస్‌ల ప్రభావం తగ్గుముఖం పట్టిన అనంతరం తిరిగి జనజీవనం యథాస్థితికొచ్చేది. కానీ కరోనా వైరస్ జనజీవన తీరులో సరికొత్త మార్పులకు నాంది పలుకుతోంది. సుమారు రెండేళ్ళ క్రితం పుట్టుకొచ్చిన ఈ వైరస్ అంచెలంచెలుగా ప్రపంచాన్ని మొత్తం కమ్మేసింది. గతంలో స్పానిష్ ఫ్లూ, కలరా, ప్లేగ్ వంటి అత్యంత ప్రమాదకర అంటురోగాల వ్యాప్తి ఎంత జోరుగా సాగినా అవి కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. అప్పటితో పోలిస్తే ఇప్పుడు ప్రయాణ సౌలభ్యాలు పెరిగాయి. ఓ దేశం నుంచి మరో దేశానికి జనం రాకపోకలు అధికమయ్యాయి. ఇందు కనుగుణంగానే కరోనా వైరస్ ప్రయాణం కూడా సులభతరమైంది. కొద్ది రోజుల్లోనే అన్ని దేశాలకు ఇది ప్రవేశించగలిగింది. ఆరుమాసాల క్రితం ప్రపంచాన్ని వణికించిన డెల్టా వైరస్ కంటే కూడా ఇది సుమారు ఆరురెట్లు వేగంతో విస్తరిస్తోంది. ఈ లెక్కన నెలతిరగక ముందే ప్రపంచ వ్యాప్తంగా ఒమిక్రాన్ తన ప్రభావం చూపే భయాందోళన పరిస్థితి స్పష్టమౌతోంది.

గతంలో పలు భయంకర వైరస్‌ల ప్రభావం తగ్గుముఖం పట్టిన తర్వాత ప్రజల జీవన విధానాల్లో ఎలాంటి మార్పుండేదికాదు. తిరిగి యదావిధిగా జీవనశైలిని కొనసాగించేవారు. కానీ కరోనా వైరస్ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవన విధానాల్లోపలు మార్పులకు శ్రీకారం చుట్టింది. పెరిగిన సాంకేతికతకు అనుగుణంగా సౌలభ్యాన్ని అభివృద్ధి చేసుకున్నాం. కొవిడ్ ప్రభావం మొదలైన తొలినాళ్ళలో ప్రపంచవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలైంది. ఆ తర్వాత ఇళ్ళ నుంచే పని చేయడం ప్రారంభమైంది. అంచెలంచెలుగా గత రెండేళ్ళలో ఈ విధానం పుంజుకుంది. ఇప్పుడు ఇళ్ళ నుంచే పని చేయడం ఓ సంప్రదాయమైంది. అందొచ్చిన అత్యంత వేగంతో కూడిన ఇంటర్‌నెట్ సౌలభ్యం, కంప్యూటర్లు, క్లౌడ్‌లో నిల్వ, నిక్షిప్త సామర్థ్యాలు, ఆధునిక కాలంలో ప్రపంచంలో ఏ మూలనుండైనా అవసరమైన పనిని పూర్తి చేయగలిగే వెసులుబాట్లను కల్పించాయి.

కోవిడ్ ప్రభావం మొదలైన తొలినాళ్ళలో ప్రపంచవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలైంది. ఆ తర్వాత ఇళ్ళ నుంచే పని చేయడం ప్రారంభమైంది. అంచెలంచెలుగా గత రెండేళ్ళలో ఈ విధానం పుంజుకుంది. ఇప్పుడు ఇళ్ళ నుంచే పని చేయడం ఓ సంప్రదాయమైంది. అందొచ్చిన అత్యంత వేగంతో కూడిన ఇంటర్‌నెట్ సౌలభ్యం, కంప్యూటర్లు, క్లౌడ్‌లో నిల్వ, నిక్షిప్త సామర్థ్యాలు, ఆధునిక కాలంలో ప్రపంచంలో ఏ మూలనుండైనా అవసరమైన పనిని పూర్తి చేయగలిగే వెసులుబాట్లను కల్పించాయి. తొలుత ఐటీరంగంలో ఈ విధానం అమలైంది. సాఫ్ట్‌వేర్ రంగం ప్రపంచ వ్యాప్తంగా అనూహ్య వేగంతో పుంజుకుంటోంది. సాఫ్ట్‌వేర్ నిపుణులను నియమించుకున్న సంస్థలు భారీగా జీతభత్యాలు చెల్లిస్తున్నాయి. దీంతో ఇప్పుడు ఇంటి నుంచే పని విధానానికి ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాలు మద్దతిస్తున్నాయి.

కోట్ల రూపాయల వ్యయంతో కార్యాలయాల నిర్వహణను ఇప్పుడు అదనపు భారంగా భావిస్తున్నాయి. గతంలో ఐటీ హబ్‌లు, ఐటీ కారిడార్‌లు, సాఫ్ట్‌వేర్ పార్క్‌ల్ని ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసేవి. అక్కడ నైపుణ్యం కలిగిన సాఫ్ట్‌వేర్ రంగ సంస్థల ఏర్పాటుకు తగిన ప్రోత్సాహం కల్పించేవి. పలు రాయితీలిచ్చేవి. ఇప్పుడు దేశంలో సాఫ్ట్‌వేర్ కూడా అతిపెద్ద విదేశీ మారకద్రవ్యాన్ని సాధిస్తున్న రంగంగా మారింది. భవిష్యత్‌లో ఇదే విధానం మరింత అభివృద్ధి చెందే అవకాశాలు స్పష్టమౌతున్నాయి. ఇప్పుడున్న కరోనాయే కాదు.. రానున్న కాలంలో ప్రపంచంపై దాడి చేసే ఏ వైరస్ నుంచి తప్పించుకోవాలన్నా వీలున్నంత వరకు ఇల్లు కదలకపోవడమే శ్రేయస్కరం. తప్పని పరిస్థితుల్లో మాత్రమే ఇల్లు కదలాలన్న ఆలోచన జనంలో పెరుగుతోంది. అలాగని ఉపాధి అవకాశాలకు కొదవలేకుండా ఆన్‌లైన్ విధానం ఉపకరిస్తోంది. ఓ వైపు సేవల రంగంలో కూడా ఈ విధానం వేళ్ళూనుకుంది.

గతంలో ఆహార పదార్థాల కోసం హోటళ్ళకెళ్ళాలి. కానీ ఇప్పుడు ఆర్డర్ ఇస్తే అవే ఇళ్ళకొస్తున్నాయి. నిత్యావసరాల కోసం దుకాణాలకెళ్ళాలి. కానీ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే నేరుగా ఇంటికే డెలివరీ చేస్తున్నారు. ఈ విధానాలు భవిష్యత్‌లో మరింత పెరుగుతాయి. దీంతో రోడ్లపై ట్రాఫిక్ సమస్య సగానికి సగం తగ్గుతుంది. రోజూ కార్యాలయాలకెళ్ళే లక్షలాదిమంది ఇళ్ళ నుంచే పనిచేస్తారు. రోజూ విద్యాలయాలకెళ్ళే లక్షలాదిమంది ఇళ్ళనుంచే అభ్యాసం చేస్తారు. మార్కెట్లు, పచారీకొట్లు, హోటళ్ళలో రద్దీ తగ్గుతుంది. ఆస్పత్రుల్లో కూడా నేరుగా వెళ్ళాల్సిన అవసరం తగ్గుముఖం పడుతుంది. ఇవన్నీ సహజంగానే రవాణాపై ప్రభావం చూపిస్తాయి. వాహనాల రాకపోకల అవసరం తగ్గిపోతుంది. అలాగే ప్రభుత్వాలు ఇప్పట్లా ఐటీహబ్‌లు, సాఫ్ట్‌వేర్ పార్కులు, మెడికల్, ఎడ్యుకేషన్ హబ్‌లంటూ ప్రత్యేకంగా వందలు, వేల ఎకరాల్ని కేటాయించి అక్కడ భారీ మౌలిక సదుపాయాల్ని కల్పించాల్సిన అవసరముండదు. దీంతో రియల్ ఎస్టేట్ రంగంపై కూడా ఈ ప్రభావం ప్రస్ఫుటమౌతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# యాసంగిలో వరి వద్దు... ప్రత్యామ్నాయ పంటలే మేలు....!

**-జిల్లా కలెక్టర్ హనుమంతరావు.**

సంగారెడ్డి, డిసెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి) జిల్లాలో రైతులు యాసంగిలో వరి వేయవద్దని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు.

సోమవారం కలెక్టర్ చౌటకూర్ , ఆందోల్ మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులతో నేరుగా మాట్లాడి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. యాసంగి లో కేంద్ర ప్రభుత్వం భారత ఆహార సంస్థ ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం లేదని తెలిపారు.

అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయదని తెలిపారు. రైతులు తమ స్వంత అవసరానికి తిండిగింజల కోసం, మిల్లర్స్, సీడ్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్న రైతులు మాత్రమే ధాన్యం వేసుకోవాల అన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండవన్నారు.రైతులు తెలిసి తెలియక వరి వేసి నష్టపో వద్దన్నారు.

యాసంగి లో ప్రత్యామ్నాయ పంటల సాగుతో అధిక దిగుబడితో లాభం చేకూరుతుందని అన్నారు.

వరికి ప్రత్యామ్నాయంగా లాభదాయకమైన ఆరుతడి పంటలను వేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించిన విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

యాసంగి లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రైతులకు వేసుకో బోయే యాసంగి పంట గురించి స్పష్టమైన అవగాహన ఉందన్నారు. జిల్లాలో ఇప్పటికే వ్యవసాయ విస్తరణ అధికారులు రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ప్రతి రైతును చైతన్య పరుస్తున్నారని పేర్కొన్నారు.



అధికారులు మొదలుకొని ప్రజాప్రతినిధుల వరకు ప్రతి రైతుకు యాసంగిలో వరి వేయవద్దని, ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లేలా అవగాహన కల్పించాలన్నారు. ఏ ఒక్కరైతు కూడా తెలియక యాసంగి లో వరి వేసి నష్టపో వద్దన్నారు.

జిల్లాలో కొనుగోలు కేంద్రాలు సజావుగా కొనసాగుతున్నాయని, ఇప్పటికే 80 శాతం ధాన్యం కొనుగోలు పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. రైతుల ఖాతాల్లో 72 గంటల్లో డబ్బులు పడుతున్నాయని, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

చౌటకూర్ మండలం ఉప్పర గూడకు చెందిన రైతు జైపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులు యాసంగిలో వరి వేయబోమని నిర్ణయం తీసుకున్నామని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకుంటామని, తిండి గింజల వరకు మాత్రమే వేసుకోనున్నట్లు కలెక్టర్కు తెలిపారు.

అందోల్ మండలం సంగు పేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం నాణ్యతను పరిశీలించి రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఏసమ్మ అనే మహిళా రైతును ఎన్ని ఎకరాల భూమి ఉంది, కొనుగోళ్లు ఏ విధంగా జరుగుతున్నాయి? మరి యాసంగి సంగతేంటి? అంటూ ఆరా తీశారు. యాసంగి లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండవని మీకు తెలిసిందా? అని అడిగారు. వేరే పంటల వైపు పోవాలని, తెలిసి తెలియక వేసుకుని నష్ట పోవద్దని సూచించారు.జిల్లాలోని చివరి రైతు వరకు యాసంగిలో వరి వేయవద్దని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని విస్తృత అవగాహన కల్పించాలన్నారు.

అనంతరం యాసంగి లో ఇతర పంటల సాగు కు సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, తహసీల్దార్లు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## బైక్ పై 179 చలానాలు .. బైక్ వదిలి పరారయిన వాహనదారుడు ..



హైదరాబాద్, డిసెంబర్ 7:హైదరాబాద్ నగర పరిసరాలలో పలు చోట్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. దాంతో తనిఖీలను ముమ్మరం చేశారు. కాగా హైదరాబాద్ కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు అలీ కేఫ్ చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తుండగా ంఖ23ఓ9895 వాహనాన్ని పట్టుకుని చెక్ చేశారు. ఆ బైక్‌పై ఉన్న చలానాలు చూసి పోలీసులే షాక్ అయ్యే పరిస్థితి నెలకొంది. దానిపై 179 చలానాలు 42,475/- రూపాయలు ఉండడంతో పోలీసులు ఆశ్చర్య పోయారు. అతని వాహనాన్ని పట్టుకుని బైక్ కి సంబంధించిన వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేయగా.. బండి వదిలి పరారయ్యాడు వాహనదారుడు. భారీ చలాన్ ఉండడంతో కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు బైక్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

## కిసాన్ క్రాఫ్ట్ కు నేపాల్ నుంచి ఆర్డర్.. 5 వేల ఇంటర్ కల్టివేటర్ల సప్లయ్ కి 20 కోట్ల ఆర్డర్..

న్యూఢిల్లీ, డిసెంబర్ 7:చిన్న రైతుల కోసం బెంగళూరుకు చెందిన కిసాన్‌క్రాఫ్ట్ అనే అగ్రి- ఎక్విప్‌మెంట్ కంపెనీకి నేపాల్ నుంచి ఆర్డర్ లభించింది. ఇటీవల ప్రారంభించిన 46 ఎకరాల నెల్లూరు క్యాంపస్‌లో 5 వేల ఇంటర్ కల్టివేటర్‌లు దేశీయంగా భారతదేశంలో తయారు చేయబడతాయి. సార్క్, ఆసియా, ఆఫ్రికా దేశాలను లక్ష్యంగా చేసుకుని 2022లో మరింత దూకుడుగా ఎగుమతులను పెంచే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని కంపెనీ ప్లాన్ చేస్తోంది. ఇంటర్‌కల్టివేటర్ అనేది చిన్న రైతులకు కలుపుతీయడం, మట్టిని తిప్పడం, మట్టి మల్చింగ్ కోసం ఉపయోగించే బహుళ- ఉపయోగ సాధనం, పంట్లను నాటడానికి ముందు మరియు తర్వాత నేల వదులుగా మరియు సున్నితంగా చేయడానికి కూడా ఉపయోగించవచ్చు. కిసాన్‌క్రాఫ్ట్ ప్రస్తుతం తన నెల్లూరు ప్లాంట్‌లో సంవత్సరానికి 75 వేల యూనిట్ల ఇంటర్ కల్టివేటర్ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది.

కిసాన్ క్రాఫ్ట్ లిమిటెడ్ సీఈవో అంకిత్ చిటాలియా నేపాల్ ఆర్డర్ గురించి స్పందిస్తూ? నెల్లూరులోని తమ కొత్త ఫ్యాక్టరీలో 2 వారాల క్రితం ఉత్పత్తిని ప్రారంభించిన నాటి నుంచి అనేక సార్క్ దేశాలు, ఆఫ్రికా నుంచి యంత్రాలపై ఆసక్తిని కనబరుస్తున్నారు. నేపాల్ నుంచి 5 వేల ఇంటర్‌కల్టివేటర్‌ల కోసం ఎగుమతి ఆర్డర్ విలువ దాదాపు రూ.20 కోట్లుగా ఉంది. త్వరలో మరిన్ని ఎగుమతి ఆర్డర్లను పొందగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ యంత్రాలు భారతదేశంలో కఠినమైన వ్యవసాయ పరిస్థితులలో నిరూపించబడ్డాయి. ప్లాట్ల పరిమాణాలు, సామర్థ్యం, లక్ష్య వినియోగాల పరంగా తాము లక్ష్యంగా ఎంచుకున్న దేశాలతో భారీ సారూప్యత ఉందని వివరించారు. సరళమైన, కఠినమైన, బహుళ వినియోగ, సరసమైన, సులభంగా సేవలు అందించే పరికరాలను ఉత్పత్తి చేస్తున్నట్టు ఆయన వివరించారు.

## ఎంపీ సంతోష్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఎర్రబెల్లి ..

హైదరాబాద్, డిసెంబర్ 7:రాజ్యసభ సభ్యులు, గ్రీన్ ఛాలెంజ్ వ్యవస్థాపకులు జోగినపల్లి సంతోష్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందించి, శాలువాతో సంతోష్ ని .. మంత్రి సత్కరించారు. సంతోష్ .. జీవితాంతం ఆయురారోగ్యాలతో ఉండాలని, సుదీర్ఘ ప్రజా జీవితం వారికి దక్కాలని కోరుకున్నారు. ఎంపీ సంతోష్ కి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఐటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిరుమల్ల రాకేష్, టిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎంపీ సంతోష్ కుమార్ ఆశయం గొప్పది : ఎమ్మెల్యే నన్నపనేని



వరంగల్, డిసెంబర్ 7:: గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంతో పర్యావరణ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తున్న ఎంపీ సంతోష్ కుమార్ ఆశయం గొప్పదని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ బర్త్ డే సందర్భంగా వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు మూడు వేల మొక్కలు నాటారు.

ఖిలా వరంగల్ మధ్య కోట గుండు చెరువు గుట్ట పక్కన డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు, గులాబీ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. సరదాగా కార్యకర్తలతో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగస్వామ్యులైన అందరికి ఎమ్మెల్యే కృతజ&జతలు తెలిపారు.

# 2024 తర్వాత రాజకీయాల్లో ఉండను : సోము వీర్రాజు

అమరావతి, డిసెంబర్ 7: ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలవరం, ఇతర అంశాలపై ఏపీ సర్కార్‌పై విమర్శలు గుప్పించిన సోము వీర్రాజు.. రాజకీయా జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఏనాడూ పదవుల కోసం ఎదురు చూడలేదన్నారు. 2014లో రాజమండ్రి టికెట్ ఇస్తానని చంద్రబాబు చెప్పినా, మంత్రి పదవి ఇస్తానన్నా వద్దన్నానని చెప్పుకొచ్చారు. 2024 తర్వాత రాజకీయాల్లో ఉండనంటూ ప్రకటన చేసి ఆశ్చర్యపరిచారు. గత 42 ఏండ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, స్వచ్ఛమైన రాజకీయాలు చేశానని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

అన్నమయ్య ప్రాజెక్టు విషయంలో కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌పై విమర్శలు చేయడం సరికాదని సోము వీర్రాజు అన్నారు. పొరపాట్లు సరిదిద్దుకోవాలి గానీ.. విమర్శలు చేయడం మంచిది కాదని హితవు పలికారు. రాష్ట్రంలో జరుగుతున్న విషయాలు షెకావత్‌కు తెలియదన్న భ్రమలో ప్రభుత్వం ఉన్నదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని డెయిరీలు, చక్కెర మిల్లులను మూసేసిన వైకాపా ప్రభుత్వాన్ని ఏమనాలని ప్రశ్నించారు. పాయకరావుపేట చక్కెర కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే విక్రయానికి సిద్ధం చేసిందని గుర్తుచేశారు. అలాంటి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను మూసేస్తున్నారని కేంద్రంపై విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. పీఆర్సీ కోసం ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు భాజపా మద్దతు ఉంటుందని సోము వీర్రాజు అన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# వేసే ప్రతి లేఅవుట్‌లో 5 శాతం భూమి ప్రభుత్వానికి.. జగన్ సర్కార్ నిర్ణయం

అమరావతి, డిసెంబర్ 7: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేట్ లేఅవుట్లకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నది. లేఅవుట్ యజమానులు 5 శాతం భూమిని ప్రభుత్వానికి ఇవ్వాలన్న నిబంధన తీసుకొచ్చారు.

ఈ మేరకు మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. లేఅవుట్‌లో తక్కువ భూమి ఉంటే యజమానులు మున్సిపాలిటీలకు సమానమైన మొత్తాన్ని చెల్లించాలని లేదా ఆ ప్రాంతానికి 3 కిలోమీటర్ల పరిధిలో భూమిని కొని ఇవ్వాల్సి ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. లేఅవుట్లలో తీసుకున్న భూమిలో 5 శాతం పేదలకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

మరోవైపు ప్రభుత్వ శాఖల్లో పరస్పర బదిలీలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు బదిలీలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జనవరి 4 వరకు బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తామని, పరస్పర అంగీకారంతో బదిలీలకు అనుమతించనున్నట్లు పేర్కొన్నది. ఈ నిర్ణయం ప్రకారం ఒకేచోట రెండేండ్ల కన్నా ఎక్కువ సమయం పాటు పనిచేసిన వారు పరస్పర బదిలీలకు అర్హులు కానున్నారు.

# ఏడ్చేవారికి అధికారమిస్తే సర్వనాశనమే: అంబటి వ్యాఖ్యలు

అమరావతి, డిసెంబర్ 7: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుపై వైసీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు రాష్ట్రానికి పట్టిన శనిలా మారారని ఫైర్ అయ్యారు. ఏడ్చే వారికి అధికారం కట్టబెడితే రాష్ట్రం అధోగతి పాలవడం ఖాయమన్నారు.

అధికారం లేకుండా చంద్రబాబు బతకలేరని వ్యాఖ్యానించారు. అధికారం కోసం ఆయన ఎన్ని అడ్డదారులు తొక్కేందుకైనా ప్రయత్నిస్తారని దుయ్యబట్టారు. అందుకే అసెంబ్లీలో శపథం చేసి మరీ వెళ్లిపోయారని చెప్పారు. సీఎంగా కాదు కదా.. ఎమ్మెల్యేగా కూడా అసెంబ్లీలో చంద్రబాబు అడుగు పెట్టలేడని అంబటి రాంబాబు అన్నారు.

ప్రజల్లో సానుభూతి పొందేందుకు కన్నీళ్లు పెట్టుకున్న చంద్రబాబు.. గౌరవ సభలు పెడతారంటున్నారని అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. మరోసారి ముఖ్యమంత్రి అయ్యే ఛాన్స్ చంద్రబాబుకు లేదని, ఇక ఆయన అసెంబ్లీకి రానవసరం లేదన్నారు. ప్రజలు జగన్ ప్రభుత్వంలో చాలా సంతోషంగా ఉన్నారని, అది చూసి ప్రతి నిత్యం చంద్రబాబు ఏడ్వటమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. నిత్యం ఏడ్చే వ్యక్తికి అధికారం ఇస్తే రాష్ట్రం సర్వనాశనం అవడం ఖాయమన్నారు.

# నిమ్స్‌లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు : మంత్రి హరీశ్‌రావు

**-రూ. 12 కోట్లతో అత్యాధునిక పరికరాలు ప్రారంభం**
**45 రోజుల్లో 200 ఐసీయూ బెడ్స్, కొత్తగా 120 వెంటిలేటర్లు సిద్ధం**
**త్వరలోనే రోబోటిక్ సర్జరీ సేవలు**



హైదరాబాద్, డిసెంబర్ 7:నిమ్స్‌లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. నిమ్స్‌లో ఏర్పాటు చేసిన ఎండోస్కోపిక్ పరికరం, ఎంఆర్‌యూ ల్యాబ్, స్టెమ్ సెల్ రీసెర్చ్ ఫెసిలిటీ, ఫిజియోథెరపీ విభాగం, బోన్ డెన్సిటోమీటర్, శాంపిల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం, వాటర్ ఏటీఎంలను హరీశ్‌రావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల హెచ్‌వోడీలతో మంత్రి హరీశ్‌రావు సమీక్ష నిర్వహించారు.

అనంతరం మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రూ. 12 కోట్లతో వివిధ మెడికల్ పరికరాలను రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. రోగులకు ఉన్నత చికిత్సలు అందించే పరికరాలను ప్రారంభించామని తెలిపారు. జన్యుపర వ్యాధుల విశ్లేషణ, గుర్తింపునకు కొత్త ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిమ్స్‌లో రూ. 2.73 కోట్లతో న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. రూ. 40 లక్షలతో అత్యాధునిక న్యూరో ఎండోస్కోపి ఏర్పాటు చేశారు. నిమ్స్‌లో అదనంగా 200 ఐసీయూ పడకలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రస్తుతానికి 155 ఐసీయూ పడకలు అందుబాటులో ఉన్నాయన్నారు. కొత్త బెడ్లు జనవరి 15 నాటికి అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.

నిమ్స్‌లో ప్రస్తుతం 89 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని, మరో 120 వెంటిలేటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. నిమ్స్‌లో పరికరాల కోసం రూ. 154 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇక్కడ రూ. 5 కే భోజనం సరఫరా చేయాలని కోరారు. ఇది అమలు చేస్తామని హరీశ్‌రావు ప్రకటించారు. ఒమిక్రాన్ కేసులు తెలంగాణలో నమోదు కాలేదని స్పష్టం చేశారు. ఒమిక్రాన్ వేరియంట్ వ్యాప్తి నేపథ్యంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

# అసాంఘిక శక్తులకు సహకరించద్దు..ఆదివాసీలకు అందుబాటులో ఉంటాం: ఏసీపీ మహేష్



కరీంనగర్ డిసెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి): అసాంఘిక శక్తులకు ఆదివాసీలు ఎప్పుడు సహకరించవద్దని బెల్లంపల్లి ఏసీపి మహేష్ కోరారు. రామగుండం పోలీస్ కమిషనర్ చంద్రశేఖర్రెడ్డి, ఓఎస్డీ శరత్ చంద్ర పవార్, డీసీపీ ఉదయ్ కుమార్ రెడ్డిల ఆదేశాల మేరకు మావోయిస్టు ప్రభావిత ప్రాంతం లైన మంగీ, తిర్యాణి ప్రాంతాలకు అనుకోని ఉన్న మంచిర్యాల జిల్లా దేవపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదివాసీ, కోలం, గిరిజన ప్రజలు కుర్రె గూడ, కొలాంగూడ, లక్ష్మిపూర్, వెంకటాపూర్ గ్రామం లలో బెల్లంపల్లి ఏసిపి మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామాలను సందర్శించి, గ్రామ ప్రజలతో మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నాలుగు గ్రామాల్లోని 200 కుటుంబాలకు కుటుంబానికి ఒకటి చొప్పున దుప్పట్లను బెల్లంపల్లి ఏసీపీ మహేష్, సీఐ మందమర్రి ప్రమోద్ రావు , ఎస్ఐ దేవాపూర్ విజేందర్ అందించడం జరిగింది.

ఈ సందర్భంగా ఏసీపీ ప్రజలతో మాట్లాడుతూ... ఏదైనా సమస్యలు ఉన్నాయని అని అడగగా గ్రామ ప్రజలు కొన్ని సమస్యలు చెప్పడం జరిగింది.అదేవిదంగా పోడు భూముల సమస్య ఉంటే సంబంధిత శాఖ ల ద్వారా ప్రభుత్వం కి అప్లికేషన్ పెట్టుకోవాలని తెలపడం జరిగింది. మిగతా సమస్యలను చెప్పిన వెంటనే స్పందించి సంబంధిత శాఖలతో మాట్లాడి పరిష్కరిస్తాము అనీ పోలీసుల హామీ ఇవ్వడంతో గ్రామస్థులందరూ కృతజ్ఞతలు తెలిపారు. యువకులు ఉన్నత విద్య నేర్చుకోవాలని వారి తల్లిదండ్రుల కి మంచి పేరు తేవాలని మరియు వారి గ్రామం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గొప్పగా మంచి పేరు తీసుకొని వెళ్లాలని, చదువు మరియు క్రీడల్లో ప్రతిభ కలిగిన యువకులను ప్రోత్సహించడానికి, పోలీస్ శాఖ మరియు ప్రభుత్వం తోడుగా ఉంటుందని వారు పేర్కొన్నారు..మావోయిస్టుల సిద్ధాంతాలు నమ్మి వారి బాటలో వెళ్లి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు జీవితాన్ని కష్టాల పాలు చేసుకోవద్దని అన్నారు.ప్రజలు ఎవ్వరు మావోయిస్టు లకు సహకరించ వద్దు ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు తమ గ్రామంలలో కనిపించిన, ఏలాంటి సమాచారం ఉన్న సంబందిత పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరడమైనది. పోలీసు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి ప్రజలు తమ ప్రశాంతమైన జీవితాన్ని శాంతియుత వాతావరణంలో గడిపేలాగా చూడడమే పోలీసుల ప్రధాన లక్ష్యం అని అన్నారు.

# కోవిడ్ సంక్షోభం మళ్ళీ వచ్చే ముప్పు తగ్గించటానికి తీసుకున్న చర్యలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 7:దేశవ్యాప్తంగా కోవిడ్ పరిస్థితిని ప్రభుత్వం నిశితంగా గమనిస్తూ అప్రమత్తంగా ఉంది. పరీక్షలు జరపటం, సోకే అవకాశమున్నవారి ఆచూకే కనిపెట్టటం, చికిత్స అందించటం, కోవిడ్ నియంత్రణకు అవసరమైన జాగ్రత్తలు పాటించేలా చూడటం, టీకాలివ్వటం అనే ఐదంచెల వ్యూహాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఆ విధంగా దేశంలో మళ్ళీ కోవిడ్ తలెత్తకుండా జాగ్రత్తపడుతోంది. అదే విధంగా ఇండియన్ సార్స్ ?కోవిడ్ -2 జీనోమిక సర్వైలెన్స్ కన్సార్షియం - ఇన్సాకార్గ్ ఏర్పాటు చేయటం ద్వారా జీనోమ్ సీక్వెన్సింగ్ తో కొత్త వేరియెంట్ల ఆనవాలు పట్టే చర్యలు తీసుకుంది.

నేషనల్ బయోఫార్మా మిషన్, ఇండ్ ? సెపి మిషన్ అనే రెండు కీలక కార్యక్రమాల అమలుకు బయోటెక్నాలజీ డిపార్ట్ మెంట్ అండగా నిలిచింది. ఇలాంటి సంక్షోభాలు ఎదురైనప్పుడు సక్రమంగా స్పందించేలా ఇవి జాతీయ టీకా కార్యక్రమాల రూపకల్పనలో కీలకపాత్ర పోషిస్తాయి. అదే విధంగా మిషన్ కోవిడ్ సురక్ష అని పిలిచే భారత కోవిడ్ టీకా అభివృద్ధి మిషన్ ను ఆత్మనిర్భర భారత్ మూడో పాకేజ్ లో భాగంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనివలన కోవిడ్ టీకా మీద పరిశోధన, అభివృద్ధికి అవకాశం మెరుగుపడింది. ఈ మిషన్ కు బయోటెక్నాలజీ డిపార్ట్ మెంట్ సారధ్యం వహించగా బయో టెక్నాలజీ ఇండస్ట్రీ రీ

# వివిధ అంటువ్యాధుల నిర్వహణలో వైద్యులకు, పారామెడికల్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

న్యూఢిల్లీ, డిసెంబర్ 7:కోవిడ్-19లో శిక్షణ, సామర్థ్య నిర్మాణం కోసం కోసం ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. కోవిడ్ -19కి సంబంధించిన సహేతుకమైన అంశాలపై డాక్టర్లకు, నర్సులకు, అనుబంధ ఆరోగ్య సంరక్షణ నిపుణులు, వాలంటీర్లకు దృశ్య మాధ్యమం ద్వారా శిక్షణ సహా పలు రకాలుగా శిక్షణను అందించారు. వివిధ సిబ్బందికి శిక్షణను ఇచ్చేందుకు భారత ప్రభుత్వం ఐజిఒటి (ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ట్రైనింగ్) ప్లాట్‌ఫాంను ఉపయోగించింది. కోవిడ్-19 ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు 14 లక్షల మంది ప్రత్యేక యూజర్లు దేశం నలుమూలల నుంచి ఈ ప్లాట్‌ఫాంపై నమోదు చేసుకున్నారు. వివిధ కోర్సులకు నమోదు చేసుకున్నవారి సంఖ్య 29.29 లక్షలుగా ఉంది. అదనంగా, 80 లక్షలకు పైగా ఆరోగ్యకార్యకర్తలకు కోవిడ్ సంబంధిత అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా శిక్షణను అందించారు. కోవిడ్ సంబంధ విషయాంశాలపై ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ సహా ఎయిమ్స్ (న్యూఢిల్లీ), నిమ్‌హాన్స్, పిజిఐఎంఇఆర్, జిప్‌మెర్ (జెఐపిఎంఇఆర్) తదిరతర ప్రతిష్ఠాత్మక సంస్థలు వెబినార్లు, ట్యుటోరియళ్ళను అప్‌లోడ్ చేశాయి. వీటిని వీక్షించిన వారి సంఖ్య 2.23 కోట్లుగా నమోదైంది. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసి) పేర్కొన్నట్టుగా, ఆగస్టు, 2020న ఎంబిబిఎస్ పాఠ్యప్రణాళికలో కోవిడ్ వంటి మహమ్మారుల నిర్వహణపై అంశాలకు సంబంధించి యోగ్యత ఆధారిత మాడ్యూల్‌ను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, గత బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ప్రవేశపెట్టింది. రాజ్యసభలో మంగళవారం ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయమంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ పేర్కొన్నారు.

# ఒమిక్రాన్ పై సింగపూర్ వైద్యశాఖ అధ్యయనాలు.. ముందు జాగ్రత్తలే ముఖ్యం అంటూ ప్రకటన..

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: ప్రపంచ వ్యాప్తంగా ఒమిక్రాన్ వేరియంట్‌పై విస్తృతంగా అధ్యయనాలు కొనసాగుతున్నాయని సింగపూర్ ఆరోగ్య శాఖ ప్రకటించింది. అన్ని వేరియంట్‌ల కంటే ఒమిక్రాన్ ఎంతో ప్రమాదకరమని.. అన్ని చోట్ల ఆందోళనకరమైన విషయాలే వెలుగులోకి వస్తున్నాయని వెల్లడించింది. గత వేరియంట్‌ల కంటే ఎంతో ప్రమాదకరమైందని.. రీ ఇన్‌ఫెక్షన్ ముప్పు డెల్టా, బీటా వేరియంట్లతో పోలిస్తే ఎంతో ఎక్కువగా ఉంటుందని తెలిపింది. కరోనా నుంచి కోలుకున్నవారు కూడా ఒమిక్రాన్‌తో రీ ఇన్‌ఫెక్షన్ బారినపడే అవకాశాలు ఎక్కువ అని తెలిపింది. అయితే ఒమిక్రాన్‌పై అధ్యయనాలు కొన సాగుతున్నందున.. ఇప్పుడే దీని తీవ్రత, ప్రాణ నష్టంపై అంచనా వేయలేమని వివరించింది.

ప్రపంచ వ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియ జోరుగా సాగుతోందని సింగపూర్ ఆరోగ్య శాఖ వివరించింది. ప్రస్తుతం ఉన్న టీకాలు కొంత మేర పని చేస్తాయని, వేరియంట్‌ను అడ్డుకునే శక్తి, సామర్థ్యాలు ప్రస్తుతం ఉన్న టీకాలకు లేదని వివరించింది. రెండు డోసులు తీసుకున్నా.. ఒమిక్రాన్ బారినపడకుండా ఉండలేమని స్పష్టం చేసింది. గత వేరియంట్‌తో పోలిస్తే.. లక్షణాల్లో కొన్ని మార్పులు ఉన్నాయని తెలిపింది. స్వల్ప లక్షణాలు మాత్రమే ఉన్నాయని, మరణాలు అయితే ఇప్పటి వరకు సంభవించలేదని చెప్పుకొచ్చింది. ఒమిక్రాన్ వేరియంట్ గురించి పూర్తి సమాచారం తెలుసుకునేంత వరకు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. మాస్క్, సామాజిక దూరం వంటివి పాటించాలని, ఇదే వైరస్ వ్యాప్తిని నిరోధిస్తుందని తెలిపింది.

# గ్యాస్ సిలిండర్ బరువు తగ్గనుందా ..!



న్యూఢిల్లీ, డిసెంబర్ 7:గ్యాస్ సిలిండర్ పై కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకోనుంది. ఎల్ పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు ప్రతి నెల వినియోగదారులకు షాక్ ని ఇస్తున్నాయి. ఎల్ పీజీ సిలిండర్ ని కొనాలంటే వెయ్యి రూపాయలుగా ఉంది. అదే కమర్షియల్ సిలిండర్ కు రూ.2200 చెల్లించుకోవాల్సి వస్తోంది. దీంతో ప్రజలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోంది. గ్యాస్ సిలిండర్ బరువును తగ్గించాలనే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. మహిళలు సిలిండర్ ట్రాన్స్ పోర్టేషన్ లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అందువల్ల సిలిండర్ బరువును తగ్గించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి రాజ్యసభలో తెలిపారు.

# కర్నూలులో వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్

అమరావతి, డిసెంబర్ 7:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్‌ను కర్నూలులో ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి గంధం చంద్రుడు జీవో జారీ చేశారు. విజయవాడలో ఉన్న ట్రిబ్యునల్ కార్యాలయాన్ని కర్నూలుకు మారుస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రాజపత్రాన్ని విడుదల చేసింది. వక్ఫ్ చట్టం-1955లోని సెక్షన్ 83 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో ట్రిబ్యునల్ ఏర్పాటు కాలేదు. దీంతో హైదరాబాద్ లో ఉన్న వక్ఫ్ ట్రిబ్యునల్ నే ఏపీ కేసుల విచారణకు వినియోగించుకుంటన్నారు. దీని వల్ల విచారణలో జాప్యం జరుగుతోంది.

# ఎస్సీల సంక్షేమానికి కేజ్రీవాల్ వరాలు!

చండీఘఢ్, డిసెంబర్ 7:: పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటాలని యోచిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆ దిశగా వ్యూహాలకు పదునుపెడుతోంది. పంజాబీలపై ఇప్పటికే పలు వరాలు కురిపించిన ఆప్ జాతీయ సమన్వయకర్త, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం దళితులు, అణగారినవర్గాల కోసం మరిన్ని హామీలు గుప్పించారు.

హోషియార్పూర్‌లో జరిగిన ర్యాలీలో కేజ్రీవాల్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఎస్సీ విద్యార్థులకు ఉచిత విద్య అందించడంతో పాటు ఐఏఎస్, మెడికల్, ఐఐటీలకు ఉచిత కోచింగ్, ఉచిత విదేశీ విద్య, ఉచిత వైద్యం అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. 18 ఏండ్ల దాటిన మహిళలకు నెలకు రూ 1000 అందిస్తామని భరోసా ఇచ్చారు. ఇక పంజాబ్ సీఎం చరణ్జిత్ సింగ్ చన్ని కులం కార్డును వాడుతున్నారని ఆరోపించారు.







# వేములవాడలో లక్ష యవగళ గీతార్చన విస్తృత ప్రచారం



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి):దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజరాజేశ్వర దేవాలయం వద్ద ఈ రోజు లక్ష యువగళ గీతార్చన గురించి ప్రచార రథం తో విస్తృత ప్రచారం నిర్వహించటం జరిగింది, ముందుగా శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ పండితులు పూజ కార్యక్రమం నిర్వహించి విశ్వహిందూ పరిషత్ ప్రాంత సహాకార్యదర్శి కోమల రాజేందర్ రెడ్డి , జిల్లా అధ్యక్షుడు ,చెపురి అశోక్ కొబ్బరి కాయ కొట్టి, కాషాయ ధ్వజం ఊపి ప్రచార రథాన్ని ప్రారంభించారు . భగవద్గీత ప్రాముఖ్యాన్ని వక్తలు వివరించారు.

ఈ కార్యక్రమం లో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ జిల్లా సీనియర్ నాయకులు మధు రాధాకృష్ణ మాట్లాడుతూ డిశంబరు 14 వ తేదీన గీతా జయంతి సందర్భంగా భాగ్యనగరం ఎల్బి స్టేడియం లో నిర్వహించబోయే లక్ష యువగళ గీతార్చన కార్యక్రమాన్ని ఆసక్తి గల యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు, కార్యక్రమం లో గడప కిషోర్ రావు,నాగుల రాములు గౌడ్ , ఆర్ ఎస్ ఎస్ కార్యవాహిని పుల్లరెడ్డి ,టి ఆర్ కె ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్,తడిగొప్పుల రవీందర్ ఆచార్య, చిలుక గట్టు, గోపాల్, శివ,హరీష్ తదితరులు పాల్గొన్నారు

# జల్ జీవన్ మిషన్ కింద రాజస్థాన్‌కు రూ.2,345 కోట్ల కేంద్ర గ్రాంట్ నిధులు విడుదలయ్యాయి

న్యూఢిల్లీ, డిసెంబర్ 7:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతి గ్రామీణ కుటుంబానికి కుళాయి నీటి కనెక్షన్‌ను అందించడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. దీని కోసం ఆగస్టు, 2019 నుండి రాష్ట్రాల భాగస్వామ్యంతో జల్ జీవన్ మిషన్‌ను అమలు చేస్తోంది. అందులో భాగంగా రాజస్థాన్ రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ అమలును వేగవంతం చేసేందుకు భారత ప్రభుత్వం రాష్ట్రానికి రూ. 2,345 కోట్లు మంజూరు చేసింది. జల్ జీవన్ మిషన్ అమలు కోసం 2021-22లో రాష్ట్రానికి కేంద్ర నిధులు రూ.10,180.50 కోట్లు కేటాయించారు. ఇది 2020-21లో చేసిన నిధుల కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ.

2024 నాటికి రాష్ట్రంలోని ప్రతి గ్రామీణ కుటుంబానికి కుళాయి నీటి సరఫరాను అందించాలని రాజస్థాన్ యోచిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 101.32 లక్షల గ్రామీణ కుటుంబాలలో 21.71 లక్షల (21.4%) కుటుంబాలు కుళాయి నీటి కనెక్షన్‌లను కలిగి ఉన్నాయి. 2019లో జల్ జీవన్ మిషన్ ప్రకటించినప్పటి నుంచి దాదాపు 9.97 లక్షల కుటుంబాలకు కుళాయి నీటి సరఫరా అందించబడింది. 2024 నాటికి మిగిలిన 80 లక్షల కుటుంబాలకు కుళాయి నీటి సరఫరాను అందించడం రాష్ట్రం ముందున్న బృహత్తర కర్తవ్యం.

సాధించాల్సిన బృహత్తర కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర జల్ శక్తి మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ జల్ జీవన్ మిషన్ కింద రాజస్థాన్ రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులను 2021-22లో రూ.10,180.50 కోట్లకు పెంచారు. గత ఏడాది కేంద్ర నిధుల కేటాయింపును 4 రెట్లు పెంచుతూ, 2024 నాటికి ప్రతి గ్రామీణ ఇంటికీ కుళాయి నీటి సరఫరాను అందించడానికి రాష్ట్రానికి పూర్తి సహాయాన్ని అందజేస్తామని శ్రీ షెకావత్ హామీ ఇచ్చారు. ఇక 2021-22లో గ్రామీణ స్థానిక సంస్థలు/పిఆర్ఐలకు నీరు ఉ పారిశుద్ధ్యం కోసం 15వ ఆర్థిక సంఘం గ్రాంట్‌గా రాజస్థాన్‌కు రూ.1,712 కోట్లు కేటాయించబడ్డాయి మరియు గ్రామీణ స్థానిక సంస్థలకు వచ్చే ఐదేళ్లకు అంటే 2025-26 వరకు రూ.9,032 కోట్లు కేటాయించబడ్డాయి. గ్రామీణ గృహాలకు నీటి సరఫరా కోసం నిధుల కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం భరోసా ఇస్తోంది. రాజస్థాన్ గ్రామీణ ప్రాంతాల్లో ఈ భారీ పెట్టుబడి ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తుంది మరియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పెంచుతుంది. దీని ద్వారా గ్రామాల్లో ఆదాయాభివృద్ధికి అవకాశం ఉంటుంది.జల్ జీవన్ మిషన్ 'బాటమ్-అప్' విధానాన్ని అనుసరించి వికేంద్రీకృత పద్ధతిలో అమలు చేయబడుతుంది. దీనిలో స్థానిక గ్రామ సంఘం.. ప్రణాళిక అమలు నుండి ఆపరేషన్ ఉ నిర్వహణ వరకు కీలక పాత్ర పోషిస్తుంది. దీని కోసం రాష్ట్రం గ్రామ నీరు ఉ పారిశుద్ధ్య కమిటీ (విడబ్ల్యుఎస్‌సి)/ పానీ సమితిని బలోపేతం చేయడం మరియు 5 సంవత్సరాల గ్రామ కార్యాచరణ ప్రణాళికను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలను చేపడుతుంది. అలాగే నీటి సరఫరా పథకాలపై సంఘం చర్చించే గ్రామ సభలో దానిని ఆమోదించింది. ఏ ఇంటిలోనైనా నీటిని తీసుకురావడానికి మహిళలు ప్రధానంగా బాధ్యత వహిస్తారు. కాబట్టి ఈ కార్యక్రమంలో పాల్గొనడాన్ని ప్రోత్సహిస్తుంది. స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక బృందాలు, స్థానిక ఎన్‌జిఓలు మొదలైనవి ఈ మిషన్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి, సురక్షితమైన నీటి ప్రాముఖ్యత గురించి వారికి అవగాహన కల్పించడానికి, సంఘంతో పరస్పర చర్చ చేయడానికి మరియు వారికి మద్దతునిచ్చేందుకు రాష్ట్రంచే అమలు మద్దతు ఏజెన్సీలుగా (ఐఎస్‌ఏలు) నిమగ్నమై ఉ న్నాయి.

సామాజిక అవగాహన పెంచడానికి మరియు వారి భాగస్వామ్యాన్ని మెరుగుపరచడానికి రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మ్యాపింగ్ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.ప్రజారోగ్యంపై దృష్టి సారించి దేశంలోని 2,000 కంటే ఎక్కువ నీటి నాణ్యత పరీక్షా ప్రయోగశాలలు సాధారణ ప్రజలకు తెరవబడ్డాయి. తద్వారా వారు నామమాత్రపు ఖర్చుతో వారు కోరుకున్నప్పుడు వారి నీటి నమూనాలను పరీక్షించవచ్చు. రాజస్థాన్‌లో 54 నీటి పరీక్ష ప్రయోగశాలలు ఉన్నాయి.అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగడానికి, మధ్యాహ్న భోజనం వండడానికి, చేతులు కడుక్కోవడానికి, మరుగుదొడ్లలో వాడుకోవడానికి కుళాయి నీటి లభ్యత ఉండేలా కృషి చేస్తున్నారు. ఇప్పటి వరకు రాజస్థాన్‌లోని 57,285 పాఠశాలలు (66.44%) మరియు 28,186 (53%) ఎడబ్లులకు పంపు నీటి సరఫరా అందించబడింది. ఈ సంస్థల్లో వీలైనంత త్వరగా పైపుల ద్వారా నీటి సరఫరాను రాష్ట్రం ఏర్పాటు చేయాలి.

ఆగస్టు, 2019లో మిషన్ ప్రారంభంలో, దేశంలోని మొత్తం 18.93 కోట్ల గ్రామీణ కుటుంబాలలో..కేవలం 3.23 కోట్ల (17%) కుటుంబాలకు మాత్రమే కుళాయి నీటి సరఫరా ఉంది. కోవిడ్-19 మహమ్మారి మరియు లాక్‌డౌన్‌ల కారణంగా సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ మిషన్ ప్రారంభించినప్పటి నుండి 5.39 కోట్ల (28%) కుటుంబాలకు కుళాయి నీటి సరఫరా అందించబడింది. ప్రస్తుతం 8.63 కోట్ల (45%) గ్రామీణ కుటుంబాలు గృహ కుళాయిల ద్వారా త్రాగునీటిని పొందుతున్నాయి. గోవా, తెలంగాణ, హర్యానా, అండమాన్ ఉ నికోబార్ దీవులు, దాద్రా ఉ నగర్ హవేలీ మరియు డామన్ ఉ దయ్యూ, పుదుచ్చేరిలోని ప్రతి గ్రామీణ కుటుంబానికి వారి ఇళ్లలో కుళాయి నీటి సరఫరా జరుగుతోంది.

'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' అనే ప్రధాన మంత్రి దార్శనికతను అనుసరించి, మిషన్ యొక్క నినాదం 'ఎవ్వరూ మిగిలిపోకుండా' మరియు ప్రతి గ్రామీణ ఇంటికీ కుళాయి నీటి కనెక్షన్ అందించబడుతుంది. ప్రస్తుతం 83 జిల్లాల్లోని ప్రతి ఇంటికి 1.27 లక్షలకు పైగా గ్రామాలకు కుళాయి నీటి సరఫరా జరుగుతోంది.




# జర్నలిస్టులకు కొండంత అండగా తెలంగాణ సర్కార్

**కరోనా బాధితులకు జర్నలిస్ట్ లకు రూ.5.56కోట్ల ఆర్థిక సాయం**
**ఈ నెల 15న హైదరాబాద్ లో చెక్కుల పంపిణీ.**
**టీయూడబ్ల్యూజేహెచ్ 143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాయక్ పాష**

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులకు రాష్ట్రప్రభుత్వం, మీడియా అకాడమీ కొండంత అండగా నిలుస్తుందని టియూడబ్ల్యూజే హెచ్ 143 రాష్ట్ర ఉ



పాధ్యక్షుడు లాయక్ పాష అన్నారు. గత రెండు సంవత్సరాలుగా కరోనా వైరస్ బారిన పడి మరణించిన వారికి, బాధితులకు మీడియా అకాడమీ ద్వారా రూ.5.56కోట్లు మంజూరు చేసిన సందర్భంగా మంగళవారం వేములవాడ పట్టణంలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్, మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా యూడబ్ల్యూజే 143 రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాష మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర పాలనలో మీడియా ప్రతినిధులు నిర్లక్ష్యానికి గురయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. కరోనాతో మరణించిన జర్నలిస్టులకు మీడియా అకాడమి తరఫున ప్రకటించిన రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని డిసెంబర్, 15వ తేదీన బుధవారం రోజు హైదరాబాద్ లోని మీడియా అకాడమీ కార్యాలయంలో అందజేయనున్నట్లు తెలిపారు. కరోనాతో మరణించిన 63 మంది జర్నలిస్టు కుటుంబాలకు తెలంగాణ మీడియా అకాడమి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. జర్నలిస్టులను పట్టించుకుని కరోనా సమయంలో వారిని ఆదుకునేందుకు నిధులు సమకూర్చిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణలకు ఆయన కృతజ్ఞతలుతెలియజేశారు.

**-కరోనా బాధితులకు రూ.5.56కోట్ల ఆర్థిక సాయం**

మార్చి 2020 నుండి డిసెంబర్ 6వ తేదీ2021 కాలంలో ఇతర కారణాలతో మరణించిన 34 మంది , కరోనా 2వ విడతలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాల మూడు లక్షల రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను ఈనెల 15న అందించడంజరుగుతుందన్నారు. 101 మంది విలేకరులకు లబ్దిచేకూరుస్తూ ఒక కోటి 62 లక్షల రూపాయల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈ కుటుంబాలకు అయిదేళ్లపాటు రూ.3000/-ల చొప్పున పెన్షన్ కూడా అందిస్తామని ఆయన తెలిపారు.

కరోనా విపత్కర సమయంలో వారియర్స్ గా పని చేసిన వైద్య సిబ్బంది, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులతోపాటు జర్నలిస్టులు కూడా వార్తా సేకరణలో గడ్డు పరిస్థితిలలో పని చేశారని అందువల్లనే జర్నలిస్టులు కూడా విరివిగా కరోనా బారిన పడ్డారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం సహకారంతో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి తరుపున కరోనా బారిన పడిన జర్నలిస్టులను ఆదుకున్నదన్నారు. ఇప్పటి వరకు మొత్తం 3909 మందిలో తొలి విడతగా 1553 మందికి 20 వేల చొప్పున, హోంక్వారంటైన్ లో ఉన్న 87 మందికి 10 వేల చొప్పున ఆర్థిక సహాయం పొందినట్లుగా తెలిపారు. రెండవ విడతలో 2269 మందికి 10 వేల చొప్పున మీడియా అకాడమి నుంచి ఆర్థిక సహాయం అందిందని వివరించారు. జర్నలిస్టులకు కరోనా సాయంగా మొత్తం 5 కోట్ల 56 లక్షల రూపాయలు మీడియా అకాడమి నుండి జర్నలిస్టుల ఖాతాలకు పంపిణీ చేసి ఆర్థికంగా ఆదుకుని దేశంలో ఆదర్శంగా మీడియా అకాడమీ నిలిచిందన్నారు.

అదే సమయంలో కరోనా బారిన పడి మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు వైద్య ఖర్చులు, ఇతర ఇబ్బందులు ఎక్కువైనందువలన వారి రెండు లక్షల రూపాయలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి తరుపున చైర్మన్ అల్లం నారాయణ ప్రకటించారని పేర్కొన్నారు. 63 మందికి బాధితులకు ఈనెల 15వ తేదీ బుధవారంనాడు సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయ భవనంలోని 2వ అంతస్తులోని మీడియా అకాడమి కార్యాలయంలో చెక్కుల పంపిణీ చేయనున్నట్లుగా తెలియజేశారు. కార్యక్రమంలో వేములవాడ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పాశం భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మహమ్మద్ రఫీ,డిప్యూటీ జనరల్ సెక్రటరీ సయ్యద్ రసూల్, జిల్లా రమేష్, శ్రీహరి, ప్రవీణ్, షబ్బీర్, సందీప్, ప్రదీప్, శ్రీకాంత్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడులో సోదాలు నిర్వహించిన ఆదాయం పన్ను శాఖ

న్యూఢిల్లీ, డిసెంబర్ 7:ఆభరణాలు, వస్త్రాలు, గృహోపకరణాల రిటైల్ విక్రయాలను సాగిస్తున్న తమిళనాడుకు చెందిన రెండు సంస్థలపై ఆదాయం పన్ను శాఖ అధికారులు 01.12.2021న దాడులు చేసి సోదాలు నిర్వహించారు. చెన్నై, కోయంబత్తూరు, మధురై మరియు తిరునెల్వేలి లో ఈ సంస్థలు అనేక దుకాణాలను ఏర్పాటు చేసి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఈ రెండు సంస్థలకు చెందిన 37 ప్రాంతాల్లో ఆదాయం పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు.

అధికారులు దాడి చేసి సోదాలు నిర్వహించిన ఒక సంస్థ తన రికార్డులను తారుమారు చేసి అమ్మకాలు జరగనట్టుగా చూపించింది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సంస్థ 1000 కోట్ల రూపాయలకు పైగా విలువ చేసే అమ్మకాల వివరాలను తొక్కి పెట్టిందని అధికారులు గుర్తించారు. సంస్థ ఆవరణలో నిర్వహించిన సోదాల్లో దీనికి సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇదేవిధంగా, గత కొద్ది సంవత్సరాలుగా ఈ సంస్థ వస్త్ర, ఆభరణాల విభాగాలు లెక్కల్లో చూపకుండా 150 కోట్ల రూపాయల నగదు కొనుగోళు చేసిందని అధికారులు గుర్తించారు.

అధికారులు దాడులు, సోదాలు నిర్వహించిన మరో సంస్థ 80 కోట్ల రూపాయల విలువ చేసే ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్టు వెల్లడయింది. ఈ సంస్థ నుంచి స్వాధీనం చేసుకున్న పత్రాలు పరిశీలించిన అధికారులు దీనిలో నకిలీ బిల్లుల రూపంలో పన్ను చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగాయని నిర్ధారించారు. ఎంపిక చేసిన సంస్థల నుంచి నకిలీ బిల్లులను పొంది వీటి ద్వారా ఈ సంస్థ తన ఆదాయాన్ని పన్ను చెల్లించాల్సిన మొత్తంలో చూపలేదని అధికారులు గుర్తించారు. లెక్కల్లో చూపని బంగారం కొనుగోళ్లు జరిగాయని కూడా అధికారులు గుర్తించారు. ఆభరణాల తయారీ చార్జీలను పెంచి చూపిస్తూ సంస్థ అక్రమాలకు పాల్పడిందని అధికారులు నిర్ధారించారు. లెక్కలు చూపని అద్దె రసీదులు, లెక్కలోకి రాని తుక్కు విక్రయాలు 7 కోట్ల రూపాయల వరకు సాగాయని కూడా గుర్తించారు.రెండు సంస్థలపై నిర్వహించిన దాడుల్లో అధికారులు లెక్కలు చూపని 10 కోట్ల రూపాయల నగదు, ఆరు కోట్ల రూపాయల విలువ చేసే బంగారం స్వాధీనం చేసుకున్నారు.

# దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి : కలెక్టర్ సంగీత

హైదరాబాద్, డిసెంబర్ 7:దివ్యాంగుల సమస్యలను పరిష్కరించి వారి సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు.సిరి ఫంక్షన్ హాల్లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో సమాజంలో సకలాంగులతో సమానంగా జీవించుటకు ముందుకు సాగాలని అన్నారు. ప్రతి వ్యక్తిలో ఒక ప్రత్యేకత, నైపుణ్యం ఉంటుందని దివ్యాంగులలో ఎంతో నైపుణ్యంగల వారు ఉన్నారని అన్నారు. సమాజంలో ఉన్నత స్థాయిలో జీవించుటకు వికలాంగులకు అంగవైకల్యం అడ్డుకాదని పట్టుదలతో కృషి చేస్తే లక్ష్యాలను సాధిస్తారని అన్నారు. ప్రభుత్వపరంగా దివ్యాంగులకు ఎన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

అర్హులైన దివ్యాంగులకు ఆసరా పించన్లు మంజూరు చేసి ప్రతి నెలా అందిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులతో మహిళా స్వశక్తి సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంకు రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామి పథకంలో దివ్యాంగులకు జాబ్ కార్డులు జారీ చేసి పనులు కల్పిస్తున్నామని తెలిపారు. త్వరలో మండలాల వారిగా అవసరమైన వారికి నూతన జాబ్ కార్డులు అందిస్తామని అన్నారు. వికలాంగులకు అవసరమైన పరికరాలను త్వరలో పంపిణీ చేస్తామని అన్నారు. జిల్లాస్థాయిలో పరిష్కారమయ్యే దివ్యాంగుల సమస్యలను పరిష్కరించుటకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనభర్చిన దివ్యాంగులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

# భారతదేశం-రష్యా21వ వార్షిక శిఖర సమ్మేళనం

న్యూఢిల్లీ, డిసెంబర్ 7:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తో పాటు భారతదేశం-రష్యా 21వ వార్షిక శిఖర సమ్మేళనం లో పాలుపంచుకోవడం కోసమని రశ్యన్ ఫెడరేశన్ అధ్యక్షుడు మాన్య శ్రీ వ్లాదిమీర్ పుతిన్ 2021వ సంవత్సరం డిసెంబర్ 6వ తేదీ నాడు న్యూ ఢిల్లీ కి విచ్చేశారు.

అధ్యక్షుడు శ్రీ పుతిన్ వెంట ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి వర్గం వచ్చింది. ప్రధాన మంత్రి శ్రీ మోదీ కి, అధ్యక్షుడు శ్రీ పుతిన్ కు మధ్య ద్వైపాక్షిక చర్చలు స్నేహపూర్ణ వాతావరణం లో జరిగాయి. కోవిడ్ మహమ్మారి సవాళ్ల ను రువ్వుతూ ఉన్నప్పటికీ కూడాను ఉభయ దేశాల మధ్య గల ప్రత్యేకమైనటువంటి మరియు విశేషాధికారాలు కలిగినటువంటి వ్యూహాత్మక భాగస్వామ్యం స్థిరమైన ప్రగతి ని నమోదు చేయడం పట్ల ఇద్దరు నేత లు వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. రెండు దేశాల కు చెందిన రక్షణ శాఖ మరియు విదేశీ వ్యవహారాల శాఖ ల మంత్రులు తొలి సారి గా 2+2 సంభాషణ ను నిర్వహించడాన్ని, సైన్యం మరియు సైన్య సంబంధి సాంకేతిక సహకారం అంశాల పైన ఏర్పాటైన అంతర్-ప్రభుత్వ సంఘం 2021 డిసెంబర్ 6న న్యూ ఢిల్లీ లో సమావేశం కావడాన్ని వారు స్వాగతించారు.

మరింత ఎక్కువ గా ఆర్థిక సహకారం చోటు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని నేతలు స్పష్టం చేశారు. మరి ఈ సందర్భం లో, దీర్ఘకాలం పాటు మార్పుల కు పెద్ద గా తావు ఉండనటువంటి మరియు నిలకడతనం కలిగినటువంటి ఆర్థిక సహకార సంబంధి వృద్ధి కోసం కొత్త చోదక శక్తులు ఆవశ్యకమని వారు నొక్కి చెప్పారు. పరస్పర పెట్టుబడుల తాలూకు సాఫల్య గాథ ను వారు ప్రశంసించారు. ఉభయ పక్షాలు రెండు దేశాల లో మరిన్ని ఎక్కువ పెట్టుబడుల ను పెట్టాలని వారు ఎదురుచూస్తున్నారు. ఇంటర్ నేశనల్ నార్థ్ - సౌథ్ ట్రాన్స్ పోర్ట్ కారిడార్ (ఐఎన్ఎస్ టిసి) మరియు ప్రతిపాదిత చెన్నై - వ్లాదివోస్తోక్ ఈస్టర్న్ మేరిటైమ్ కారిడార్ ల రూపం లో సంధానం యొక్క భూమిక సైతం చర్చల లో ప్రస్తావన కు వచ్చింది. రశ్యా లో వివిధ ప్రాంతాల మధ్య, మరీ ముఖ్యం గా రశ్యా లోని దూర ప్రాచ్య ప్రాంతాని కి, భారతదేశం లోని రాష్ట్రాల కు మధ్య అంతర్ ప్రాంతీయ సహకారం ఇతోధికం గా చోటు చేసుకోవాలని ఇద్దరు నేత లు ఆశించారు. కరోనా మహమ్మారి కి వ్యతిరేకం గా సాగుతున్న యుద్ధం లో ప్రస్తుతం ద్వైపాక్షిక సహకారం కొనసాగుతూ ఉండటాన్ని వారు ప్రశంసించారు. జరూరైన కీలక కాలాల్లో రెండు దేశాలు ఒకదాని కి మరొకటి మానవీయ సహాయాన్ని అందించుకోవడం బాగుందని వారు పేర్కొన్నారు.

మహమ్మారి అనంతర కాలంలో ప్రపంచవ్యాప్తం గా ఆర్థిక స్థితిగతులు కోలుకొంటూ ఉండటం సహా, ప్రాంతీయం గాను, అంతర్జాతీయం గాను చోటు చేసుకొన్న పరిణామాల ను గురించి, ఇంకా అఫ్ గానిస్తాన్ లో స్థితి ని గురించి నేత లు చర్చించారు. అఫ్ గానిస్తాన్ విషయం లో ఇరు దేశాలు ఉమ్మడి ఆందోళనల ను, దృష్టి కోణాల ను వ్యక్తం చేస్తున్నాయని వారు అంగీకరించారు. అఫ్ గానిస్తాన్ అంశం లో సహకారాని కి, సంప్రదింపుల కు ఎన్ఎస్ఎ స్థాయి లో ద్వైపాక్షిక మార్గసూచీ ని రూపొందించడం పట్ల వారు తమ ప్రశంస ను వ్యక్తం చేశారు. అనేక అంతర్జాతీయ అంశాల లో ఇరు పక్షాలదీ ఉమ్మడి స్థితే అని వారు గమనించారు. ఐక్యరాజ్య సమితి భద్రత మండలి సహా బహుపాక్షిక వేదికల లో సహకారాన్ని మరింత ఎక్కువ గా బలపరచుకోవలసి ఉందంటూ సమ్మతి ని వ్యక్తం చేశారు. భారతదేశం ప్రస్తుతం ఐక్య రాజ్య సమితి భద్రత మండలి లో శాశ్వతేతర సభ్యత్వాన్ని వహిస్తుండటం పట్ల మరియు బిఆర్ఐసిఎస్ ('బ్రిక్స్') కు 2021వ సంవత్సరం లో అధ్యక్ష పదవి ని నిర్వహించడం లో సఫలం కావడం పట్ల ప్రెసిడెంటు శ్రీ పుతిన్ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కి అభినందన లు తెలిపారు. రశ్యా ప్రస్తుతం ఆర్క్ టిక్ కౌన్సిల్ కు అధ్యక్షత వహిస్తున్నందుకు గాను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర్ మోదీ అభినందనల ను వ్యక్తం చేశారు.

'ఇండియా-రశ్యా: పార్ట్ నర్ శిప్ ఫార్ పీస్, ప్రోగ్రెస్ ఎండ్ ప్రాస్ పెరిటి' పేరు తో జారీ చేసిన సంయుక్త ప్రకటన ద్వైపాక్షిక సంబంధాల తాలుకు స్థితి ని, భావి అవకాశాల ను సముచిత రీతి లో వెల్లడిస్తున్నది. ఈ సందర్శన కాలం లోనే, వ్యాపారం, శక్తి, సైన్స్ ఉ టెక్నాలజీ, మేధోసంపత్తి, అంతరిక్షం, భూ సంబంధి అన్వేషణ, సంస్కృతి సంబంధి ఆదాన ప్రదానం, విద్య తదితర వివిధ రంగాల లో రెండు దేశాల వాణిజ్య సంస్థల కు, ఇంకా ఇతర సంస్థల కు మధ్య, అలాగే ప్రభుత్వాని కి, ప్రభుత్వాని కి మధ్య ఒప్పంద పత్రాల పై, ఎమ్ఒయు ల పై సంతకాలు అయ్యాయి. మన ద్వైపాక్షిక భాగస్వామ్యానికి ఉన్నటువంటి బహుముఖీన స్వభావాన్ని ఇది ప్రతిబింబిస్తున్నది.

2022 వ సంవత్సరం లో జరుగనున్న 22వ ఇండియా-రశ్యా ఏన్యువల్ సమిట్ లో పాల్గొనడానికి గాను రశ్యా ను సందర్శించవలసిందంటూ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కి అధ్యక్షుడు శ్రీ పుతిన్ ఆహ్వానం పలికారు.

# జీఎస్టీ పరిహారం కింద ఏపీకి రూ.543 కోట్లు విడుదల : మంత్రి పంకజ్ చౌదరి

న్యూఢిల్లీ, డిసెంబర్ 7:జీఎస్టీ పరిహారం కింద నవంబర్ 3 న రాష్ట్రాలకు రూ.17 వేల కోట్లు విడుదల చేశామని, అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వాటా కింద రూ.543 కోట్లు ఇచ్చినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. మంగళవారం రాజ్యసభలో వైసీపీ సభ్యుడు వీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఏప్రిల్ 20 నుంచి మార్చి 21 మధ్య జీఎస్టీ పరిహారం కింద రాష్ట్రాలకు విడుదల చేసిన రూ.1,13,464 కోట్లకు ఇది అదనం ఆయన చెప్పారు.

2017లో జీఎస్టీ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 2017-18, 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఆయా రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం కింద రావాల్సిన మొత్తాలను పూర్తిగా విడుదల చేశామని మంత్రి పంకజ్ చౌదరి చెప్పారు. కరోనా మహమ్మారి విజృంభణ నేపథ్యంలో జీఎస్టీ వసూళ్లు గణనీయంగా తగ్గాయని మంత్రి తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్రాలకు చెల్లించాల్సిన జీఎస్టీ పరిహారం వాటా పెరిగిందని, కానీ ఆ మేరకు చెల్లింపులు చేసేందుకు జీఎస్టీ పరిహార నిధిలో సరిపడా నిధులు లేవని స్పష్టం చేశారు. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు జీఎస్టీ పరిహారం కింద కేంద్రం ఇంకా రూ.51,798 కోట్లు బకాయి ఉన్నదని మంత్రి వెల్లడించారు.

# డాటా సైన్స్‌లో నూతన విద్యావకాశాలు: ఒడిన్ స్కూల్




హైదరాబాద్, డిసెంబర్ 7:గ్రే క్యాంపస్‌లో భాగమైన ఒడిన్ స్కూల్, భారతదేశంలో నైపుణ్యవంతులైన డాటా సైన్స్ ప్రొఫెషనల్స్ లభ్యత పరంగా ఉన్న అంతరాలను తగ్గించేందుకు తమ విద్యా కార్యక్రమాలు ప్రారంభించినట్లు వెల్లడించింది. ప్రభావవంతమైన శిక్షణా పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించిన ఒడిన్ స్కూల్, మూడు నూతన అవకాశాలు : సాంకేతిక రంగంలో మహిళల కోసం స్కాలర్‌షిప్ ; అందరికీ ఉచితంగా విద్య మరియు యూనివర్శిటీ భాగస్వామ్యాలు ? ఆవిష్కరించింది. ఇవన్నీ కూడా డాటా సైన్స్‌లో వారి కెరీర్‌లను నిర్మించడంలో ప్రజలకు సహాయపడటమే లక్ష్యంగా చేసుకున్నాయి. 'ఉమెన్ ఇన్ టెక్' స్కాలర్‌షిప్స్‌ను ప్రధానంగా మహిళలు ఆర్థిక అవరోధాలను అధిగమించడంలో సహాయపడటాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. వీటి ద్వారా డాటా సైన్స్‌లో శక్తివంతమైన కెరీర్‌లను నిర్మిస్తారు. భారతదేశంలో డాటా సైన్స్‌లో 20% కన్నా తక్కువగా మహిళలు పనిచేస్తున్నారన్న వాస్తవాలను పరిగణలోకి తీసుకుని ఒడిన్ స్కూల్, ఇప్పుడు ఔత్సాహిక మహిళలకు ఒక కోటి రూపాయలను ఈ ఉత్సాహపూరితమైన విభాగంలో ప్రోత్సహించేందుకు కేటాయించింది.. అత్యున్నత అర్హతలు కలిగిన మహిళలకు 100%స్కాలర్‌షిప్‌లనూ అందజేస్తారు. డాటా సైన్స్ ఔత్సాహికుల కోసం ఉచిత మరియు ఎక్స్‌క్లూజివ్ వేదిక 'అకాడమీ'?. ఇది విజ్ఞానం, అవకాశాలు కోరుకునే ఔత్సాహికులు, ప్రొఫెషనల్స్, మేధావులు, పరిశ్రమ నిపుణులను ఒకే దరికి తీసుకురావడంతో పాటుగా డాటా సైన్స్ డొమైన్‌లో భాగస్వామ్యాలనూ తీసుకువస్తుంది.కాలేజీలలో డాటా సైన్స్ నైపుణ్యం అభివృద్ధి చేసే ప్రయత్నంలో ఒడిన్ స్కూల్ ప్రారంభించిన మరో కార్యక్రమం 'యుని?కాన్'. విద్యాసంస్థలతో భాగస్వామ్యం చేసుకుని ఫ్యాకల్టీ నైపుణ్యం మెరుగుపరచడంతో పాటుగా విద్యార్థులకు డాటా సైన్స్ పరంగా పలు అభ్యాస ప్రయోజనాలను సైతం పూర్తి ఉచితంగా అందిస్తుంది .ఒడిన్‌స్కూల్ ఇప్పుడు ఆరు నెలల పాటు బూట్‌క్యాంప్‌ను డాటా సైన్స్‌లో అందిస్తుంది. ఇది యువ ప్రొఫెషనల్స్, గ్రాడ్యుయేట్లకు తమ కెరీర్‌లను మరింత మెరుగుపరచుకునేందుకు తోడ్పడే రీతిలో డిమాండ్‌లో ఉన్న నైపుణ్యాలను సైతం పొందేందుకు తోడ్పడుతుంది. ఈ కార్యక్రమానికి పరిశ్రమ నిపుణులు నేతృత్వం వహించనున్నారు. వీరు అభ్యర్థులకు ముఖాముఖి మెంటార్‌షిప్ సదుపాయాలను సైతం అందించనున్నారు. "ఒడిన్ స్కూల్ వద్ద, మేము ఉద్యోగాధారిత అభ్యాస అనుభవాలను అందిస్తుంటాము. కెరీర్ శిక్షణా కార్యక్రమాల ప్రదాతగా, ఈ అభివృద్ధి చెందుతున్న రంగంలో కెరీర్‌లను పొందాలనుకుంటున్న ప్రజలకు తోడ్పడే ందుకు సైతం మేము మా కోర్సులను తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నాము.

అకాడమీ మరియు ఉమెన్ ఇన్ టెక్ స్కాలర్‌షిప్స్ ఖచ్చితంగా తమ కెరీర్‌లలో ముందంజలో ఉండాలని కోరుకునే అభ్యర్థులందరికీ వారి ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా భారీ అవకాశంగా నిలుస్తాయి. అదనంగా, దేశంలో సాంకేతిక రంగంలో భావి తరాలను తీర్చిద్దిద్దాలనుకుంటున్నాము. యుని?కాన్ కార్యక్రమం, ప్రస్తుత సాంకేతికత ధోరణులకనుగుణంగా ఫ్యాకల్టీకి సహాయపడటంతో పాటుగా వారు భావి నిపుణులను తీర్చిదిద్దడంలోనూ తోడ్పడనుంది" అని విజయ్ పసుపులేటి, సీఈవో అండ్ కో ఫౌండర్ ? గ్రే క్యాంపస్ మరియు ఒడిన్ స్కూల్ అన్నారు.

# తగ్గిన సిమెంట్ ధరలు.

హైదరాబాద్, డిసెంబర్ 7:: సిమెంటుకు గిరాకీ భారీగా పడిపోవడంతో దక్షిణాది రాష్ట్రాల్లో సిమెంట్ తయారీ కంపెనీలు ధరలను తగ్గించాయి. 50 కిలోల బస్తాపై రూ.20-40 వరకు తగ్గించినట్లు డీలర్లు తెలిపారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో బస్తాకు రూ.40 వరకు, తమిళనాడులో రూ.20 దాకా కోతలు పడ్డాయి. కేరళ, కర్ణాటకల్లోనూ రూ.20-40 వరకు కోత విధించారు.ఈ ధరల తగ్గింపు నేపథ్యంలో 50 కిలోల బస్తా తెలుగు రాష్ట్రాల్లో రూ.280-320కి పరిమితం కానుంది. తమిళనాడులో ఒక టాప్ బ్రాండ్ సిమెంటు ధర రూ.400 దిగువకు, కర్ణాటక, కేరళల్లోనూ బస్తా ధర రూ.360-400 నుంచి రూ.340-380కి చేరినట్లు డీలర్లు వివరించారు.

# రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అధ్య గోలి ఫౌండేషన్ వ్యవస్థాపకులు



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి): రాజ్యసభ సభ్యులు , గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త జోగినిపల్లి సంతోష్ కుమార్ జన్మదినం సందర్భంగా అదిగోలి ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ గోలి మోహన్ మంగళవారం హైద్రాబాద్ ప్రగతిభవన్లో రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ గోలి మోహన్ మాట్లాడుతూ జోగినిపల్లి సంతోష్ కుమార్ మరెన్నో పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు . ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు . గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తం చేశారని అన్నారు .

# ఇండో ఆర్క్ జిఐఎస్ ను ఆవిష్కరించిన ఇస్రీ ఇండియా

హైదరాబాద్, డిసెంబర్ 7:దేశంలో సుప్రసిద్ధ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) సాఫ్ట్‌వేర్ మరియు పరిష్కారాల ప్రదాత ఇస్రీ ఇండియా నేడు ఇండో ఆర్క్‌జీఐఎస్‌ను ఆవిష్కరించినట్లు వెల్లడించింది. భారతదేశంలోని జీఐఎస్ వినియోగదారుల కోసం వినియోగించడానికి సిద్ధంగా ఉన్న జీఐఎస్ ఆధారిత పరిష్కారాలు మరియు జియోస్పేషియల్ కంటెంట్ అవసరాలను తీర్చడానికి ఇది ఉపయోగపడుతుంది. ప్రపంచంలో సుప్రసిద్ధ మ్యాపింగ్ మరియు ఎనలిటిక్స్ వేదిక ఆర్క్‌జీఐఎస్ సాంకేతికత శక్తి కలిగిన ఇండో ఆర్క్‌జీఐఎస్, ఫారెస్ట్ మేనేజ్‌మెంట్, డిజార్డర్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్ యుటిలిటీస్, ల్యాండ్ రికార్డ్స్ మరియు ఆస్తిపన్ను నిర్వహణ విభాగాలలో పరిష్కారాలను అందిస్తుంది. పలు ఇతర రంగాల కోసం ఉత్పత్తులు అభివృద్ధి దశలో ఉన్నాయి. ఈ పరిష్కారాలను అత్యంత సులభంగా ఆర్క్‌జీఐఎస్ వినియోగదారులు వినియోగించుకోవచ్చు. ఇస్రీ ఇండియా ఇప్పుడు 300కు పైగా లేయర్ల డాటాను ఆర్క్‌జీఐఎస్ లివింగ్ అట్లాస్ యొక్క భారతీయ ఎడిషన్ ద్వారా అందిస్తుంది. ఈ డాటా లేయర్లు కీలకమైన నిర్ణయాలను తీసుకోవడంలో ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థలకు అత్యంత కీలకం. గ్రామ స్థాయి, పిన్‌కోడ్ హద్దులు, జాతీయ మరియు రాష్ట్రఅసెంబ్లీ నియోజకవర్గాలు, జనాభా సమాచారం, భూ సమాచారం, సహజవనరులు, వాతావరణం, ఆసక్తికరమైన ఇతర అంశాల వరకూ ఖచ్చితమైన హద్దులను అవి అందిస్తాయి.ఇస్రీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అగే ంద్ర కుమార్ మాట్లాడుతూ "ఇండో ఆర్క్‌జీఐఎస్‌లో జోడించబడిన ఈ డాటా లేయర్లు మరియు సొల్యూషన్ ప్రొడక్టులు దేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను పరిష్కరించడానికి అప్లికేషన్‌ల విస్తరణ సమయం తగ్గించడం మరియు జియో స్పేషియల్ టెక్నాలజీలో ఆర్థిక విలువల సృష్టికి తోడ్పాటునందించడం కోసం రూపొందించబడ్డాయి" అని అన్నారు.ఇస్రీ ఇండియా 1996లో నిపుణులు, ప్రొడక్ట్ ఇంజినీరింగ్ వనరులతో ప్రారంభమైంది. ఈ సొల్యూషన్ ప్రొడక్ట్స్, డాటా లేయర్లను నోయిడా, పంచకుల లోని ఇస్రీ ఇండియా సదుపాయాల వద్ద అభివృద్ధి చేశారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com